నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY



సంపుటి : 13 సంచిక : 180 రంగారెడ్డి | శనివారం 31 అక్టోబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 31-10-2026 october | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To:Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada

దేశం సంక్షోభంలో ఉంటే..

వారు సంతోషిస్తారు: విపక్షాలపై మోదీ ఆగ్రహం

ఢిల్లీ, నిర్భయవార్త ప్రతినిధి :ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయంగా సంక్షోభం నెలకొన్న సమయంలో దేశంలో విపక్షాలు వదంతులు వ్యాప్తి చేస్తున్నాయని ప్రధాని నరేంద్రమోదీ ధ్వజమెత్తారు. ప్రజల్లో భయాందోళన సృష్టించేందుకు వారు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గుజరాత్‌లోని బనస్కాంతలో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. పీఎం కిసాన్ 24వ విడత నిధులను విడుదల చేసిన సందర్భంగా ప్రతిపక్ష పార్టీల చర్యలను ఖండించారు.“దేశంలో ప్రజలంతా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుంటే.. కొన్ని రాజకీయ వర్గాలు దేశ ప్రగతి పట్ల అసంతృప్తిగా ఉన్నాయి. దేశం ఇబ్బందుల్లో పడాలని వారు



కోరుకుంటున్నారు. గల్ఫ్ ఉద్రిక్తతల కారణంగా అనిశ్చిత పరిస్థితులుంటే.. ఎరువులు, గ్యాస్ కొరత గురించి వదంతులు వ్యాప్తిచేస్తున్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించి.. మోదీని దెబ్బతీయాలన్నది వారి ప్లాన్. దేశం కష్టాల్లో ఉండాలని కోరుకునే వీరు.. సంక్షోభ సమయాల్లో సంతోషిస్తారు” అని విపక్షాలపై మోదీ మండిపడ్డారు. రైతులకు అండగా ఉంటామని గతంలో ఇచ్చిన హామీకి తగ్గట్టే తమ ప్రభుత్వ విధానాలు కొనసాగుతున్నాయని ప్రధాని ఈ సందర్భంగా చెప్పారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎరువుల ధరలు పెరిగినా ఆ భారాన్ని రైతులపై పడనివ్వడం లేదని గుర్తు చేశారు.

పీఎం కిసాన్ నిధుల జమ..ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 24వ విడతలో సుమారు రూ.19వేల కోట్లను ప్రధాని మోదీ నేడు విడుదల చేశారు. ఆ నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. దీని కింద దేశవ్యాప్తంగా 9.34 కోట్లమంది రైతులు లబ్ధిపొందారు.

రేవంత్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తిరుగుతా..: ఈటల



హైదరాబాద్, నిర్భయవార్త జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాలంటూ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర కొనసాగుతోంది. ఈ సందర్భంగా పాదయాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తిరుగుతానని స్పష్టం చేశారు. ‘నేను డంప్ యార్డు తీసేయాలని పాదయాత్ర చేస్తుంటే ఈటల రాజేందర్ పనిలేక తిరుగుతున్నారంటూ కాంగ్రెస్ నాయకులు అంటున్నారట.. ఈ డంప్ యార్డ్‌ను తొలిగించే వరకు మాత్రమే కాదు.. మీ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తిరుగుతా’ అంటూ వ్యాఖ్యానించారు.జవహర్‌నగర్ డంపింగ్ యార్డు రీసైకిల్ కోసం ఎంత ఖర్చవుతుందో డీపీఆర్ చేసి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎంపీ కోరారు. ప్రధాని నరేంద్ర నరేంద్ర మోదీని ఒప్పించి అవసరమైన డబ్బులను తీసుకొస్తామని ప్రకటించారు. అలా తీసుకురాలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా అంటూ ఎంపీ ఈటల రాజేందర్ ఛాలెంజ్ విసిరారు. కాగా.. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలంటూ ఈనెల 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎంపీ ఈటల రాజేందర్ పాదయాత్రను మొదలుపెట్టారు. ఈ డంపింగ్ యార్డు వల్ల వెలువడే కాలుష్యంతో చుట్టుపక్కల గ్రామాలు, కాలనీల ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని తెలిపారు. గాలి, భూగర్భ జలాలు కలుషితమయ్యాయని.. వెంటనే డంపింగ్ యార్డును తొలగించాలని ఎంపీ డిమాండ్ చేశారు.

రూ.కోట్ల భూమిని కొట్టేయాలని కేసీఆర్ చూసిండు..

ఢిల్లీ వేదికగా రేవంత్ సంచలన ఆరోపణలు



ఢిల్లీ, అక్టోబర్ 30 : నిర్భయవార్త ప్రతినిధి :తెలంగాణలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు తమ ప్రభుత్వం అత్యంత సమర్థవంతంగా పనిచేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతిపక్ష కేసీఆర్ వర్గంపై పలు తీవ్రమైన ఆరోపణలు చేశారు. మియాపూర్ భూముల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో అనుకూలంగా తీర్పు వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. మియాపూర్‌లోని దాదాపు 550 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి తమ అనుచరులు, కొందరు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు గతంలో కేసీఆర్ ఆయన అనుచరగణం చూశారని ఆరోపించారు. ఈ భూముల విలువ దాదాపు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడే పోరాటం..

గత ప్రభుత్వం అక్రమార్కులకు అనుకూలంగా తీర్పులు వచ్చేలా వ్యవహరించిందని, కోర్టుల్లో ఎప్పుడూ ప్రభుత్వానికి అనుకూలంగా బలమైన వాదనలు వినిపించలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు.



నిర్భయవార్త

సంపాదకీయం

శనివారం 31 అక్టోబర్ 2026

అర్నబ్ దెబ్బ..!

ఎల్‌నినో హెచ్చరికలతో ఆందోళన చెందుతున్న అన్నదాతలకు పులిమీద పుట్రలా ఆర్నబ్ తుపాను తీరని నష్టం కలిగించడం విషాదకరం. ఈ ఖరీఫ్ పంట చేతికొస్తే కొంతవరకైనా ఆర్థిక కష్టాల నుంచి బయటపడవచ్చని ఆశించిన రైతులకు తుపాను తీవ్ర నిరాశ మిగిల్చింది. అప్పులు చేసి, అనేక కష్టాలు ఎదుర్కొని సాగు చేసిన రైతులకు పంట చేతికందే సమయంలో ఊహించని నష్టం ఇది. పొట్ట దశ మొదలు కోతకు సిద్ధమైన స్థితి వరకూ ఉన్న వరి పొలాలు నీట మునిగాయి. అరటి, కొబ్బరి వంటి ఉద్యాన పంటలకూ తీవ్ర నష్టం వాటిల్లింది. సాగు ఖర్చులు పెరిగి, గిట్టుబాటు ధర లభించక ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ పరిణామం తేరుకోలేని దెబ్బ.ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 2,24,489 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. సుమారు 3.45 లక్షల మంది రైతులు నష్టపోయారు. దాదాపు 2,09,460 హెక్టార్లలో వరి దెబ్బతిన్నట్లు అంచనా. పశ్చిమ గోదావరి జిల్లాలో 76,176 హెక్టార్లు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమలో 44,232 హెక్టార్లు, కాకినాడలో 42,222 హెక్టార్లు, తూర్పు గోదావరిలో 29,866 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బాపట్ల జిల్లాలోనూ 4,032 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. పొలాల్లో నీరు నిలవడం, ధాన్యం మొలకెత్తడం, చేను కుళ్లిపోవడం వంటి వాటి పట్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,763 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో అరటి, కొబ్బరి, కూరగాయలు, బొప్పాయి, పసుపు, పూలు, తమలపాకు వంటి పంటలు ఉన్నాయి. 13 ఉమ్మడి జిల్లాల్లోని 114 మండలాల పరిధిలో 715 గ్రామాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం. 8,471 హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 46,500 కొబ్బరి చెట్లు దెబ్బతిన్నట్లు వార్తలొచ్చాయి. క్షేత్రస్థాయి సర్వే పూర్తయ్యే నాటికి పంట నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. తుపాను కారణంగా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. రహదారులు, ఇళ్లు దెబ్బతిన్నాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 20 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.ఆర్నబ్ తుపాను కారణంగా రూ.4,563 కోట్ల నష్టం జరిగినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ముందుగా అప్రమత్తం కావడం వల్ల భారీ నష్టాన్ని నివారించగలిగామని వ్యాఖ్యానించారు. తుపాను తీవ్రతను ముందుగానే అంచనా వేసే శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం, ప్రజల్లో అవగాహన పెరగడం, మూడు నాలుగు దశాబ్దాల క్రితంతో పోలిస్తే రక్షిత నివాసాలు పెరగడం ఆస్తి, ప్రాణ నష్టాలను భారీగానే తగ్గిస్తున్నాయి. అయితే, పంటల నష్టాన్ని నివారించడం సాధ్యం కాదు. నష్టాన్ని తగ్గించేందుకు చేసిన ప్రయత్నాలను చెప్పుకోవడంతోపాటు, జరిగిన నష్టంపై వాస్తవాలను అంగీకరించాలి. క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగా బాధితులకు పరిహారం అందించడంపై దృష్టి పెట్టాలి. మృతుల కుటుంబాలకు తక్షణమే పరిహారం అందించడంతోపాటు, ఇళ్లు దెబ్బతిన్నవారికి, జీవనోపాధి కోల్పోయినవారికి సాయం చేయాలి. వరద ప్రభావిత కుటుంబాలకు బియ్యం, ఉప్పు, పప్పులు వంటి నిత్యావసర సరకులు పంపిణీ చేయాలి. వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, చిరు వ్యాపారులనూ ఆదుకోవాలి. భూమి తమ పేరుపై లేకపోవడం వంటి కారణాలతో కౌలు రైతులు పరిహారానికి దూరం కాకూడదు. వాస్తవంగా సాగు చేసి నష్టపోయిన కౌలు రైతులను గుర్తించి సాయం అందించాలి.2018లో శ్రీకాకుళం జిల్లాలో వచ్చిన తిత్లీ తుపాను ఉద్దానం ప్రాంతాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. 22 వేల హెక్టార్లకు పైగా జీడిమామిడి తోటలు, 12 లక్షలకు పైగా కొబ్బరి చెట్లు దెబ్బతిని, 1,06,592 మంది రైతులు నష్టపోయినట్టు అధికారిక నివేదికల్లో పేర్కొన్నారు. అయితే, పంటల వర్గీకరణలో పొరపాట్లు, అర్హులైన రైతుల పేర్లు జాబితాల్లో లేకపోవడం, పరిహారంలో తేడాలు వంటి ఫిర్యాదులు చాలా వచ్చాయి. దాదాపు 16 వేల మంది రైతులకు సాయం అందలేదని విమర్శలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా గ్రామాలవారీగా నష్టం వివరాలను ప్రకటించి, రైతులు తమ వివరాలను పరిశీలించుకునే అవకాశం కల్పించాలి. సర్వేలో పేర్లు నమోదు కానివారు, నష్టం తక్కువగా అంచనా వేశారని భావించేవారు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. అర్హులైన ప్రతి రైతుకూ, కౌలు రైతుకూ జాప్యం లేకుండా పరిహారం అందాలి.రాష్ట్ర ప్రభుత్వం నష్టం వివరాలను కేంద్రానికి నివేదించిన నేపథ్యంలో, కేంద్రం తక్షణమే అదనపు ఆర్థిక సాయం ప్రకటించాలి. విపత్తుల బారినపడ్డ పలు రాష్ట్రాలకు, ముఖ్యంగా ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాలకు మోడీ ప్రభుత్వం నుంచి అవసరమైనంత సాయం అందలేదనే విమర్శలు ఉన్నాయి. అలాంటి పరిస్థితి తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి, బాధితులకు అవసరమైన నిధులు త్వరగా విడుదలయ్యేలా చూడాలి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సహాయ కార్యక్రమాలను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోకూడదు. పార్టీలు, రాజకీయ అనుబంధాలతో సంబంధం లేకుండా బాధితులందరికీ సాయం అందించాలి. విపత్తుల వేళ పాలకులు మరింత మానవీయంగా, బాధ్యతగా వ్యవహరించాలి.

వేడెక్కుతున్న భూమి.. ప్రమాదంలో మానవాళి!

భూతాపంతో పెరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలు.. భారత నగరాలకూ పొంచి ఉన్న ముప్పు!

ప్రకృతి మనిషిని పదేపదే హెచ్చరిస్తోంది. ఒకవైపు భరించలేని ఎండలు, మరోవైపు కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలు, కరవులు, కరుగుతున్న హిమానీనదాలు.. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు మానవాళి భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకప్పుడు అరుదుగా సంభవించే ప్రకృతి వైపరీత్యాలు ఇప్పుడు అనేక ప్రాంతాల్లో తరచూ ఎదురవుతున్నాయి. వర్యావరణ సమతుల్యతను కాపాడుకోకపోతే రాబోయే తరాలకు సురక్షితమైన భూమిని అందించడం కష్టమనే హెచ్చరికలు తీవ్రమవుతున్నాయి.ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) 2026 మార్చిలో విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2015 నుంచి 2025 వరకు నవోదైన పదకొండు సంవత్సరాలే చరిత్రలో అత్యంత వేడైన సంవత్సరాలు. 2025లో భూమి నగటు ఉష్ణోగ్రత పారిశ్రామికీకరణకు పూర్వపు స్థాయికంటే 1.43 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదైంది. సముద్రాల్లో ఉష్ణశక్తి నిల్వలు రికార్డు స్థాయికి చేరాయి. ధ్రువప్రాంతాల్లో మంచు విస్తీర్ణం తగ్గడం, హిమానీనదాలు కరగడం ప్రమాద తీవ్రతను తెలియజేస్తున్నాయి.వాతావరణ మార్పుల ప్రభావం భారత్‌లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ 2025 అధ్యయనం ప్రకారం, దేశంలోని 57 శాతం జిల్లాలు తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా అధిక లేదా అత్యధిక ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. దేశ జనాభాలో 76 శాతం మంది ఈ జిల్లాల్లో నివసిస్తున్నారు. ముఖ్యంగా నగరాల్లో కాంక్రీటు నిర్మాణాలు, వచ్చదనం తగ్గడం, వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడే వేడి పరిస్థితులను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.దేశంలోని పలు ప్రధాన నగరాలు భిన్నమైన వాతావరణ ముప్పులను ఎదుర్కొంటున్నాయి. నాగ్‌పూర్, అహ్మదాబాద్, జైపూర్, ఢిల్లీ, పుణె, చెన్నై నగరాల్లో తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కతా, పుణె, గువాహటి నగరాల్లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు తరచూ సమస్యలను సృష్టిస్తున్నాయి. మరోవైపు ముంబై, చెన్నై, కోల్‌కతా, కొచ్చి, విశాఖపట్నం, సూరత్ వంటి తీరప్రాంత నగరాలకు సముద్రమట్టం పెరుగుదల దీర్ఘకాలిక ముప్పుగా పరిణమిస్తోంది. ఈ ప్రమాదాల తీవ్రత నగరాల భౌగోళిక పరిస్థితులు, మౌలిక సదుపాయాలు, జనసాంద్రతను బట్టి మారుతోంది. సరైన ప్రణాళికలు లేకుండా పట్టణాలు విస్తరించడం, చెరువులు, కాలువలు ఆక్రమణలకు గురికావడం, వర్షపు నీటి పారుదల వ్యవస్థలు బలహీనపడటం సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.భారత పట్టణాల్లో వరద ముప్పును తగ్గించేందుకు కేంద్రం రెండు దశల్లో రూ.5,520.07 కోట్లతో కార్యక్రమాలను ఆమోదించింది. అయితే నిధుల కేటాయింపుతోనే సమస్య పరిష్కారం కాదు. నగరాల్లో సహజ నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించాలి. చెరువులను పరిరక్షించాలి. వర్షపు నీటి పారుదల వ్యవస్థలను ఆధునికీకరించాలి. అభివృద్ధి ప్రణాళికల్లో వాతావరణ మార్పుల ప్రభావాన్ని తప్పనిసరిగా పరిగణించాలి.హిమాలయాల్లో మంచు కరుగుదల మరో తీవ్రమైన సవాలుగా మారుతోంది. హిమానీనదాల క్షీణతతో మంచు సరస్సులు ఉప్పొంగడం, ఆకస్మిక వరదలు సంభవించడం, దీర్ఘకాలంలో నదీ జలాల లభ్యత మారడం వంటి ప్రమాదాలు పెరుగుతున్నాయి. మరోవైపు కరవులు వ్యవసాయ దిగుబడులను, ఆహార భద్రతను ప్రభావితం చేస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాల ప్రభావం ప్రధానంగా పేదలు, రైతులు, కార్మికులు, తీరప్రాంత ప్రజలపై పడుతోంది. అభివృద్ధి ఫలాలు అందరికీ చేరాలంటే పర్యావరణ ముప్పుల నుంచి బలహీనవర్గాలకు రక్షణ కల్పించడం అత్యవసరం.ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం 2025 నివేదిక ప్రకారం, ప్రస్తుత విధానాలే కొనసాగితే ఈ శతాబ్దం చివరికి ప్రపంచ ఉష్ణోగ్రతలు పారిశ్రామికీకరణకు పూర్వపు స్థాయికంటే సుమారు 2.8 డిగ్రీల సెల్సియస్ పెరిగే ప్రమాదముంది. ఈ పరిస్థితిని నివారించేందుకు కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించాలి. పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని విస్తరించాలి. అటవీ సంపద, జీవవైవిధ్యం, నీటి వనరులను పరిరక్షించాలి. అభివృద్ధి చెందిన దేశాలు వర్ధమాన దేశాలకు సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక సహకారం అందించాలి.ముఖ్యంగా నగరాల్లో వచ్చదనం పెంచడం, వడగాడ్పుల నివారణ కార్యాచరణను అమలు చేయడం, వరదలపై ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయడం అవసరం. ప్రజారవాణా, వర్షపు నీటి సంరక్షణ, వర్యావరణహిత నిర్మాణాలను ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు, పరిశ్రమలు, పౌరులు సమష్టిగా బాధ్యత తీసుకోవాలి. పర్యావరణ పరిరక్షణను అభివృద్ధికి అడ్డంకిగా కాకుండా సుస్థిర ప్రగతికి పునాదిగా గుర్తించాలి.భూతాపం రేపటి ప్రమాదం కాదు.. నేడు మానవాళిని వెంటాడుతున్న సంక్షోభం. ప్రకృతి విధ్వంసాన్ని అరికట్టడంలో నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తు తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. భూమిని రక్షించుకోవడం మనకు ఉన్న అవకాశం మాత్రమే కాదు, తప్పనిసరి బాధ్యత కూడా. ఎందుకంటే మనిషి జీవించడానికి మరో భూమి లేదు.. కోల్పోయిన ప్రకృతిని తిరిగి సృష్టించే శక్తీ లేదు!

(సి. హెచ్. ప్రతాప్)

ప్రభుత్వమే నియమించిన అంపైర్ - నిరసనలపై నిషేధాజ్ఞలు




రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇటీవల 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికకు ఒక వ్యాసం రాశారు. 'యుద్ధంలో తొలిగా బలయ్యేది సత్యం' అనే వాక్యంతో ఆ వ్యాసం మొదలవుతుంది. ఎన్నికల సంఘంపై విమర్శలు ఊహాజనితమైనవనీ, ఎన్నికల సంఘం పనితీరుకు సుప్రీంకోర్టు ఆమోద ముద్ర వేసిందనీ, దానికి వ్యతిరేకంగా వీధుల్లో జరిగే నిరసనలు అరాచకత్వానికి అడుగులని ఆయన ఈ వ్యాసం ద్వారా భావిస్తున్నారని నేను అర్థం చేసుకున్నాను. సత్యానంతర రాజకీయాల గురించి ఆయన రాసిన వ్యాసంలో, భారతదేశ ఎన్నికల సంఘం లోపల జరుగుతున్న పరిణామాలకు సత్యానంతర అనే పదానికి అతికినట్లుండే ఏ ఒక్క అధికారిక పత్రం గురించీ ప్రస్తావించలేదు.'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలో సెప్టెంబర్ 23న ప్రచురితమైన రితిక చోప్రా పరిశోధన, అక్టోబర్ 2025 నుండి ఆగస్టు 2026 వరకు నడిచిన ఉత్తర ప్రత్యుత్తరాల ఆధారంగా సాగింది. ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరైన సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి తమ అభ్యంతరాలను లిఖితపూర్వకంగా నమోదు చేశారు. వారి ప్రమేయం లేకుండా తీసుకున్న అనేక నిర్ణయాలపై (ఓటర్ల చేర్పులు, తొలగింపులు, ఎన్నికల జాబితా భద్రతతో పాటుగా) పది నెలల్లో 14 సార్లు (ఒకే రోజు నాలుగు సార్లు సహా) వారు తమ అసమ్మతిని తెలిపారు. ఎన్నికల సంఘం పేరిట చేపట్టిన చర్యలలో కొన్నింటిని వారు "అధికారికం కాదు, చట్ట విరుద్ధం" అని కూడా అభివర్ణించారు. రాజ్‌నాథ్ సింగ్ చెప్పే ఒక్క మాట--- ఈ అసమ్మ తి వాదనలు వాస్తవాలపై ఆధారపడి ఉండాలని. అలా అనడంలో ఆయన ఘటికుడే! ఒకసారి వాస్తవాలను పరిశీలిద్దాం.ఎన్నికల సంఘం ఒక వ్యక్తి చేతిలో నడిచే సంస్థ కాదు. కానీ ప్రస్తుతం అది పనిచేస్తున్న తీరు చూసినట్లయితే అందుకు విరుద్ధంగా వుందని అర్థమవుతుంది. ఆర్టికల్ 324 ఎన్నికల సంఘం పర్యవేక్షణ, దిశా నిర్దేశం, నియంత్రణను ఎన్నికల సంఘానికే కట్టబెట్టింది. అంతే తప్ప ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యక్తిగతంగా ఆ అధికారాలను కట్టబెట్టలేదు. ఆర్టికల్ 324 (5) ప్రకారం, సుప్రీంకోర్టు న్యాయమూర్తిని ఏ విధంగా తొలగిస్తారో అదే ప ద్ధతిలో మాత్రమే సి.ఇ.సి ని తొలగించవచ్చు. కానీ ఇతర కమిషనర్లను సి.ఇ.సి సిఫారసు మీద మాత్రమే తొలగించవచ్చు. కాబట్టి, అసమ్మతి తెలిపిన ఆ ఇద్దరు కమిషనర్లు సరిగ్గా తమను తొలగించగల అధికారం ఏ వ్యక్తికి ఉందో తెలిసి కూడా, ఆ వ్యక్తికి వ్యతిరేకంగానే అసమ్మతి గళం విప్పారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో వచ్చిన కథనానికి ఎన్నికల సంఘం ఇచ్చిన బహిరంగ స్పందన ఏమిటంటే, నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరిగాయని. కానీ రికార్డయి ఉన్న 14 రాతపూర్వక అభ్యంతరాలను బట్టి చూస్తే, సి.ఇ.సి తో కమిషనర్లు తీవ్రంగా విభేదిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ అభ్యంతరాలను స్వయంగా కమిషనర్లే లేవనెత్తారు తప్ప ప్రతిపక్షాలు కల్పించినవి కావు. ఈ ఆరోపణలు నిజంగా నిరాధారమైనవే అయితే, దాన్ని రుజువు చెయ్యడానికి ఒక తేలికైన పరిష్కారం ఉన్నది. ఎన్నికల సంఘం తన ఫైల్ నోట్లను ప్రచురించాలి, సాఫ్ట్‌వేర్ యాక్సెస్ లాగ్‌లను బహిర్గతపరచాలి, రాష్ట్ర అధికారులను పక్కకు తప్పించి ఢిల్లీలో ఓటర్ల డేటాబేస్ కేంద్రీకరణకు ఎవరు అధికారం ఇచ్చారో రికార్డులను వెల్లడించాలి. ఒకవేళ సంస్థలు రికార్డులను చూపకుండా ప్రజా విశ్వాసాన్ని ఆశించినట్లయితే, అది కేవలం గుడ్డి విధేయతను డిమాండ్ చేయడమే అవుతుంది.'సర్' అనేది ఓటరును జాబితాలో చేర్చాలి. కానీ రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ బీహార్‌లో ఈ ప్రక్రియను నిలిపివేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది, అంతేకాదు ఆ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాను ప్రక్షాళన చెయ్యడం అవసరమని చెప్పింది అని సమర్థింపుగా మాట్లాడుతున్నారు. అయితే సుమారు 65 లక్షల మంది ఓటర్ల పేర్లు ఏ కారణాల రీత్యా తొలగి ంచబడ్డాయనేది స్పష్టంగా పేర్కొంటూ జాబితాలు ప్రచురించాలని కూడా సుప్రీం కోర్టు ఆదేశించింది. ఎందుకంటే "ప్రజలకు తెలుసుకునే హక్కు ఉంది". అలాగే ఆధార్‌ను గుర్తింపు రుజువుగా అంగీకరించాలని కూడా అది ఆదేశించింది. న్యాయపరంగా సవాలు చేయబడి, ఆ తర్వాత న్యాయపరంగానే సరిదిద్దబడిన ఈ కసరత్తు "చట్టబద్ధమైనది, పరిపాలనాపరంగా సమర్థనీయమైనది" అని రాజనాథ్ సింగ్ చెప్పడం సబబేనా?ఇక మరో ప్రశ్న ఏమిటంటే, ఈ ప్రభుత్వం తనను తాను కాపాడుకోవడానికి ఈ 'సర్' ప్రక్రియను అడ్డం పెట్టుకుంది-అనర్హులను తొలగించడం అనేది అందరినీ నమ్మించ డానికి వాడుతున్న మాట. సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినట్లుగా, పౌరసత్వాన్ని నిర్ణయించే అధికారం ఎన్నికల సంఘానికి లేదు, పౌరసత్వ చట్టం కింద ఆయా కేసులు నమర్థులైన అధికారులకు నివేదించబడాలని ఆదేశించింది. అయితే, ఈ కేసులను విచారించే అధికారం ఏ మంత్రి త్వ శాఖకు ఉందో తెలియ చెయ్యమని సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాధానం ఏంటంటే ఆ అధికారం ఎవరికి ఉందో ఆ మంత్రిత్వ శాఖకే తెలియదు. కోర్టు ఆదేశాలను పాటించడానికి ఏం చేశారనేదానిపై స్పష్టత లేదు. దీన్ని బట్టి చూస్తే ఈ కసరత్తు అసలు ఉద్దేశం ఓట్ల తొలగింపు మాత్రమే. ఈ ప్రక్రియలో ఇబ్బందులు పరిష్కరించాలన్న ఆలోచన రాజ్‌నాథ్ సింగ్ కు ఉన్నట్లు కనిపించదు. సుప్రీంకోర్టు ఆమోదించని డిబేట్ లోని విమర్శలను అణిచివేయడానికి మాత్రం ముందుంటారు.ఇ.వి.యంల పట్ల అభ్యంతరాలు ఉన్నప్పటికీ, ఇ.వి.యం ల గురించిన అనేక సమంజసమైన ప్రశ్నలు ప్రజల మనస్సులలో ఇంకా అలాగే ఉన్నాయి. అందువల్ల ఇ.వి.యం లకు సంబంధించిన అనేక కీలక అంశాలను పునఃపరిశీలించడం అనేది ఇప్పటికీ అత్యవసరమైన ఆందోళనగా ఉంది. దీనిని వీలైనంత త్వరగా పరిష్కరించాలి. వి.వి.పాట్ టాలీ 100 శాతం ఉండేలా ఒక నిబంధన ఉండాలన్న మా డిమాండ్‌ను మేం పునరుద్ఘాటిస్తున్నాము. ఈ ప్రక్రియలో పారదర్శకతను తీవ్రంగా వ్యతిరేకించే ఒక వ్యవస్థ ద్వారా యంత్రాలను ఉపయోగించుకుని ఓటర్లను తొలగించడం ఇప్పటికీ కొనసాగుతుందనేదే మా ప్రధాన అభ్యంతరం.ప్రభుత్వమే ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకాన్ని చట్టవరంగా వ్యవస్థీకరించిందనేది రాజనాథ్ సింగ్ ప్రధాన వాదన. ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక చరిత్ర మాత్రం దీనికి భిన్నంగా ఉంది. పార్లమెంటు చట్టం చేసే వరకు ప్రధాన మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, భారతదేశ ప్రధాన న్యాయమూర్తులతో కూడిన సెలక్షన్ ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని 2023 మార్చిలో సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రతిపక్ష ఎంపీల సస్పెన్షన్ నడుమ, ఈ కమిటీలో సభ్యుడైన ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ఒక కేంద్ర కేబినెట్ మంత్రిని చేర్చి మరీ పార్లమెంటులో చట్టం తీసుకువచ్చింది. ఈ ప్యానెల్‌లో ఉన్న ముగ్గురిలో ఇద్దరు ప్రభుత్వ ప్రతినిధులు ఉన్నాక ప్రతిపక్షం వ్యతిరేకత సహజంగానే వీగిపోతుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం నియామకానికి తగిన చట్టం రూపొందించామని మోడీ ప్రభుత్వం చెప్పుకున్నప్పటికీ ఇది కేవలం పై పై పూత ద్వారా ఆ వ్యవస్థను చేజిక్కించుకోవడమే. నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ తీర్పును సుప్రీం కోర్టు కొట్టివేయడాన్ని తమ ప్రభుత్వం గౌరవించిందని సింగ్ చెబుతున్నారు కానీ సెలక్షన్ ప్యానెల్ నుండి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించడం ద్వారా దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాన్ని తమ ప్రభుత్వం ధిక్కరించిందనే వాస్తవాన్ని ఆయన సౌకర్యవంతంగా విస్మరిస్తున్నారు.అలాగే ఈ ప్రభుత్వం ఎన్నికల సంఘం సభ్యులకు కల్పించిన ఇమ్యూనిటీ (రక్షణ హక్కు) గురించి మాట్లాడుకోవాలి. 2023 చట్టంలోని సెక్షన్ 16 ప్రకారం, "ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఎన్నికల కమిషనర్‌గా ఉన్న/పనిచేసిన ఏ వ్యక్తి అయినా, తన అధికారిక చెప్పిన ఏ చర్య లేదా మాట కైనా, అతను పదవిలో ఉన్నప్పుడు లేదా ఆ తర్వాత, ఎలాంటి సివిల్ / క్రిమినల్ చర్యలు చేపట్టడానికి కానీ, ఏ కోర్టు కూడా విచారించడం లేదా కొనసాగించడం తగదు" అని నిర్దేశించారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదు పారదర్శకంగా చేపట్టాలి

తప్పుడు ధృవపత్రాలు సమర్పిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు -- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి



అల్వాల్, అక్టోబర్ 30 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి:పట్టభద్రుల ఓటర్ల నవోదు ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓటరు నమోదుకు సంబంధించి తప్పుడు ధృవపత్రాలు సమర్పించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం అల్వాల్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డిలతో కలిసి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నమోదు ప్రక్రియ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు పరిశీలన సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేస్తూనే, నిబంధనల ప్రకారం అర్హులైన పట్టభద్రుల పేర్లను మాత్రమే ఓటరు జాబితాలో చేర్చాలని సూచించారు.



ధృవపత్రాల పరిశీలనలో అప్రమత్తంగా ఉండాలి

దరఖాస్తుదారులు సమర్పించిన ఫారం-18, డిగ్రీ సర్టిఫికెట్లు, ఇతర సంబంధిత ధృవపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే వారి అర్హతను నిర్ధారించాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని, నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు ధృవపత్రాలు సమర్పించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్, అల్వాల్ ఎంఆర్ఓ రాములు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాష్లీ బేక్ హౌస్ ప్రారంభోత్సవంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కూకట్పల్లి, అక్టోబర్ 30 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి:కూకట్వల్లి నియోజకవర్గంలోని జేఎన్టీయూ మెట్రో స్టేషన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాష్లీ బేక్ హౌస్ ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన మేనకోడలు ఏర్పాటు చేసిన సంస్థను ప్రారంభించి, యాజమాన్యానికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపార సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు వ్యాపార రంగ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాధు ప్రతాప్ రెడ్డి, పట్లోళ్ల నాగిరెడ్డి, శేరి సతీష్ రెడ్డి, బి. సంజీవ్ రావు, మేకల మైఖేల్, కొండల్ రెడ్డి, ఏఎంసీ పనింద్ర కుమార్, తమ్మినేని ప్రవీణ్ కుమార్, కళ్యాణ్ బాబు తదితరులు పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

డీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రభావతి రెడ్డి పిలుపు



ఖమ్మం అక్టోబర్ 30 నిర్భయవార్త రిపోర్టర్ ఖమ్మం--వరంగల్--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రుల ఓటరు నవోదు ప్రక్రియను వేగవంతం చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రభావతి రెడ్డి కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రైవేట్ విద్యానంస్థల యాజమాన్యాలు, న్యాయవాదులు, గ్రానైట్ అసోసియేషన్ నాయకులు, మేధావులు సమన్వయంతో పనిచేసి పట్టభద్రుల్లో ఓటు నవోదుపై అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కొప్పుల ప్రభావతి రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు, భావితరాల భవిష్యత్తుకు పట్టభద్రుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా ఆయా సంఘాల నాయకులు చొరవ చూపాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డికి మద్దతుగా నిలిచి, ఆయనను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సామినేని హత్య కేసులో నిజాలు నిగ్గు తేల్చాలి!

భట్టి రాజీనామా చేయాలి.. సీపీని బదిలీ చేయాలి

సిట్తో సమగ్ర విచారణ జరిపించాలి.. కారేపల్లిలో భట్టి, సీపీ దిష్టిబొమ్మల దగ్ధం

కారేపల్లి, అక్టోబర్ 30 నిర్భయవార్త రిపోర్టర్. సీపీఎం సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పాతర్లపాడు మాజీ సర్పంచ్ కామ్రేడ్ సామినేని రామారావు హత్య కేసులో నిజమైన నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కేసు విచారణను పక్కదారి పట్టిస్తున్నారంటూ ఆరోపిస్తూ శుక్రవారం కారేపల్లిలో ఆందోళన చేపట్టారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఖమ్మం పోలీస్ కమిషనర్ దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసన తెలిపారు.సీపీఎం సింగరేణి మండల కార్యదర్శి కె. నరేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సామినేని రామారావు హత్య కేసులో అసలు నిందితులను గుర్తించకుండా, కేసుతో సంబంధం లేని వారిని అరెస్టు చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. హత్య వెనుక ఉన్న అసలు కుట్రను వెలికితీసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఏడాది కావస్తున్నా వెలుగులోకి రాని నిజాలు!

సామినేని రామారావు హత్య జరిగి ఏడాది కావస్తున్నా, హత్య వెనుక ఉన్న కుట్రను, దాని వెనుక ఉన్న వ్యక్తుల పాత్రను పూర్తిస్థాయిలో వెలికితీయడంలో పోలీసు వ్యవస్థ విఫలమైందని నాగేశ్వరరావు విమర్శించారు. కేసు విచారణ తీరుపై అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని పేర్కొన్నారు.కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు విచారణ సాగుతోంది అంటూ పోలీసుల దర్యాప్తు తీరుపై ఆయన విమర్శలు గుప్పించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కేసును పక్కదారి పట్టిస్తున్నారనే



అనుమానాలకు వ్రస్తుత పరిణామాలు తావిస్తున్నాయని ఆరోపించారు. హత్య కేసులో వాస్తవాలను ప్రజల ముందుంచి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భట్టి రాజీనామా చేయాలి.. సీపీని బదిలీ చేయాలి

సామినేని రామారావు హత్య కేసు విషయంలో నైతిక బాధ్యత వహిస్తూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాజీనామా చేయాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కేసు విచారణపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిగేలా ప్రస్తుత పోలీస్ కమిషనర్ను బదిలీ చేయాలని కోరారు. సిట్తో విచారణ జరిపించి అసలు నిందితులను గుర్తించి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని స్పష్టం చేశారు.అధికారాన్ని అడ్డుపెట్టుకుని చట్టాన్ని దుర్వినియోగం చేస్తే దానిని ప్రజాపాలనగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నించారు. హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై తీవ్ర ఆరోపణలు చేశారు.

న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు.

సామినేని రామారావు హత్య కేసులో వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులకు శిక్ష పడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సీపీఎం నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం స్పందించి నిష్పక్షపాత విచారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేసి ప్రభుత్వ వైఖరిని ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు ముక్క సీతారాములు, కార్యదర్శివర్గ సభ్యుడు రేకల మంగయ్య, మండల కమిటీ సభ్యులు ముండ్ల ఏకాంబరం, శ్రీరాములు, తిరపయ్య, సైదులు, కోటయ్య, సంపత్, మంద శ్రీను, బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు... రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.



ఖమ్మం, అక్టోబర్- 30 నిర్భయవార్త రిపోర్టర్. రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని పీవిఆర్ గార్డెన్స్ లో ఏదులాపురం మునిసిపాలిటీ లోని 176 మంది లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదవారి ఒక స్లాబ్ ఇళ్లలో ఉండాలనే కల, ఆశ ఏదైతే ఉందో అది నెరవేర్చాలనే తపనతో ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు ఇవ్వడం జరిగిందని హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలో మరో లక్ష ఇళ్లు, ఇవన్నీ కలిపి ఈ రెండు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇళ్లు 40 వేల కోట్ల రూపాయలతో కట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం వంద శాతం పేదోళ్ల మనసును దోచిన, మెచ్చినదని, అర్హులైన ప్రతి పేదవాడికి కులం, మతం, పార్టీ అని చూడకుండా, పూర్తిగా పేదల సంక్షేమమే ధ్యేయంగా అమలు చేయబడుతోందని మంత్రి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు లో మియాపూర్ కు సంబంధించి 560 ఎకరాల భూమి వివాదంలో ప్రయివేటు వ్యక్తులకు అప్పటి ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తే, అప్పుటి పార్లమెంట్ సభ్యుడిగా, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టులో న్యాయమైన వాదనలు పెట్టి ఆ కేసు గెలిచామని తెలిపారు.హౌ ప్రతి ఆడబిడ్డకు రూ. 5 లక్షల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని తెలిపారు.ప్రతిపక్షాలు ఎన్ని గావు కేకలు పెట్టినా, ఎన్ని పొర్లు దండాలు పెట్టినా, ఎన్ని క్షుద్ర పూజలు చేసినా ప్రజా ప్రభుత్వం మళ్లీ ప్రజల దీవెనలతో అధికారంలోకి వస్తుందని మంత్రి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఏదులాపురం మునిసిపాలిటీ కి మొదటి విడతలో దాదాపు 467 ఇళ్లు మంజూరు కాగా, ఇందులో దాదాపు 400 వరకు ఇళ్లు నిర్మాణం పూర్తై లబ్ధదారులకు అందుబాటులోకి వచ్చాయన్నారు. మరో 45 ఇళ్లు మాత్రమే వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయని, కొన్ని నెలల క్రితం శాంక్షన్ వచ్చిన 18 మంది లబ్ధదారులు కూడా వేగంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. లబ్ధదారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. ఇండ్ల నిర్మాణం స్టేజి పూర్తి కాగానే ఫోటోలు తీసుకుని, కేవలం వారం పది రోజుల్లోనే బిల్లులు చెల్లించడం వల్ల లబ్ధదారులు ఎంతో త్వరగా ఇళ్లను నిర్మించుకోగలిగారన్నారు.మొదటి విడత విజయవంతమైన నేపథ్యంలో, ఇప్పుడు రెండో విడత కింద 176 ఇళ్లను లబ్ధదారులకు అందజేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ రెండో విడత ఇళ్ల నిర్మాణాలను కూడా అతి త్వరగా పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కనకపుడి నాగయ్య మృతికి నివాళి

పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కంపాటి రవి

కారేపల్లి, అక్టోబర్ 30 నిర్భయవార్త. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కనకపుడి నాగయ్య మృతి పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతికి నివాళులర్పిస్తూ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కంపాటి రవి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆదేర్ల అంజయ్య, ఆదేర్ల రాములు, బాలకృష్ణ తదితరులు పాల్గొని కనకపుడి నాగయ్యకు నివాళులర్పించారు. ఆయన మృతి ఎమ్మార్పీఎస్కు తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



నగర రవాణా భవిష్యత్తుకు 'సైబరాబాద్ మూవ్స్--2026'

నవంబర్ 26 నుంచి 28 వరకు టీ-హబ్‌లో ప్రత్యేక ప్రదర్శన







సైబరాబాద్, అక్టోబర్ 30 నిర్భయవార్త సిటీ బ్యూరో: నగరంలో సురక్షితమైన, సమ్మిళితమైన, పర్యావరణహిత రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా 'సైబరాబాద్ మూవ్స్--2026' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నవంబర్ 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు టీ-హబ్‌లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్, షిఫ్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఇనిషియేటివ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నాయి. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేశ్, ఐపీఎస్ మాట్లాడుతూ.. నగర విస్తరణకు అనుగుణంగా ప్రజలకు సురక్షితమైన, సులభమైన రవాణా సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వ శాఖలు, సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి. సృజన, ఐఏఎస్ మాట్లాడుతూ.. నగరాభివృద్ధికి అనుగుణంగా మెరుగైన రవాణా వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ జంక్షన్ల అభివృద్ధి, రహదారుల మెరుగుదల, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. విద్యార్థులు మొబిలిటీ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో పాల్గొని వినూత్న ఆలోచనలను పంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవాణా వ్యవస్థకు సంబంధించిన మ్యాపులు, సమాచార ప్రదర్శనలు, నిపుణుల చర్చలు, అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. విద్యార్థులు, ప్రజల వినూత్న ఆలోచనలకు కూడా అవకాశం కల్పించనున్నారు. సమావేశంలో టీజీఎస్ఆర్టీసీ, హెచ్ఎండీఏ, హుమ్టా, రవాణా శాఖ, ఓపెన్ డేటా తెలంగాణ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే వైద్య సంస్థలపై కఠిన చర్యలు

కూకట్‌పల్లిలో ఆకస్మిక తనిఖీలు.. రెండు చోట్ల స్కానింగ్ యంత్రాలు సీజ్,



వేఢ్చల్ మల్కాజిగిరి, అక్టోబర్ 30 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రజారోగ్యం, రోగుల భద్రత విషయంలో రాజీ పడేది లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు నిర్వహించే ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఇందులో భాగంగా శుక్రవారం డీఎంహెచ్ఓ డా. కె. ఆనంద్ పలు వైద్య సంస్థల్లో ఆకస్మిక



తనిఖీలు నిర్వహించారు.కూకట్‌పల్లిలోని ట్రిశూల్ డయాగ్నస్టిక్స్‌లో తనిఖీల సందర్భంగా అనుమతులు, సిబ్బంది వివరాలు, కాలుష్య నియంత్రణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన పత్రాల్లో లోపాలను గుర్తించారు. మెడిని కాస్మెటిక్ సర్జరీ క్లినిక్ పేరుతో ఉన్న అనుమతులకు, ట్రిశూల్ పేరుతో నిర్వహిస్తున్న డయాగ్నస్టిక్ సేవలకు వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనలకు సంబంధించి లోపాలు గుర్తించడంతో అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని సీజ్ చేశారు.అదేవిధంగా గెలాక్సీ లేజర్ సర్జరీ ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించగా, తాత్కాలిక రిజిస్ట్రేషన్ గడువు ముగియడంతో పాటు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలు, చికిత్స ధరల పట్టిక వంటి అంశాల్లో లోపాలు గుర్తించారు. దీంతో ఆసుపత్రికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.వీఎంఆర్ హాస్పిటల్స్, మెటర్నిటీ అండ్ సర్జికల్ సెంటర్‌లోనూ తనిఖీలు నిర్వహించిన అధికారులు పీసీపీఎన్‌డీటీ చట్ట నిబంధనల ఉల్లంఘనలను గుర్తించి అల్ట్రాసౌండ్ యంత్రాన్ని సీజ్ చేయడంతో పాటు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి వైద్య సంస్థ తప్పనిసరిగా చట్టబద్ధమైన అనుమతులు, రిజిస్ట్రేషన్లు, సిబ్బంది వివరాలు, అవసరమైన రికార్డులను నిర్వహించాలని సూచించారు. వైద్య సేవల్లో లోపాలు, నిబంధనల ఉల్లంఘనలు ఎదురైతే ప్రజలు ఆధారాలతో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయానికి లిఖితపూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

జర్నలిస్టుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం

నవంబర్‌లో సారపాకలో టీజేఎంయూ ద్వితీయ మహాసభలు.. జర్నలిస్టులు తరలిరావాలి

మణుగూరు, అక్టోబర్ 30, నిర్భయ వార్త ప్రతినిధి. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం కలంతో పోరాడే జర్నలిస్టులు నేడు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ (టీజేఎంయూ) పినపాక నియోజకవర్గ అధ్యక్షులు కొర్స రవి అన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా నవంబర్ నెలలో బూర్గంపాడు మండలం సారపాకలో టీజేఎంయూ ద్వితీయ మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

జర్నలిస్టులకు భద్రత కరువు

సమాజ సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజల పక్షాన నిలిచే జర్నలిస్టులకు నేడు వృత్తిపరమైన భద్రత, ఆరోగ్య రక్షణ కొరవడుతున్నాయని కొర్స రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది పాత్రికేయులు సొంత ఇళ్లు లేక అద్దె గృహాల్లో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వార్తా సేకరణలో భాగంగా ప్రాణాలకు తెగించి పనిచేసే విలేకరులపై బెదిరింపులు, అక్రమ కేసులు నమోదవుతుండటం ఆందోళనకరమన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

భేదాలు వీడి ఏకతాటిపైకి రావాలి

రాజకీయ, వ్యక్తిగత భేదాలను పక్కనపెట్టి వర్కింగ్ జర్నలిస్టులంతా ఏకతాటిపైకి రావాలని కొర్స రవి పిలుపునిచ్చారు. జర్నలిస్టుల హక్కుల సాధన, సంక్షేమం, వృత్తి భద్రత వంటి అంశాలపై తమ గళాన్ని వినిపించేందుకు మహాసభలు వేదికగా



నిలుస్తాయని తెలిపారు.యూనియన్ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ ఇనపనూరి ప్రభాకర్ ఆదేశాల మేరకు ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి టీజేఎంయూ రాష్ట్ర అధ్యక్షులు ఐ. ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ యాదవ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు సామల ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి. ఉదయ్ రాఘవేంద్రతో పాటు జిల్లా కమిటీ సభ్యులు హాజరుకానున్నట్లు తెలిపారు. పినపాక నియోజకవర్గ పరిధిలోని పినపాక, బూర్గంపాడు, మణుగూరు, కరకగూడెం, గుండాల మండలాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని కొర్స రవి కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

రెండు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.31 లక్షల నిధులు.. పనులకు శ్రీకారం



జవహర్‌నగర్ అక్టోబర్ 30 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మాజీ మేయర్, జవహర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. జవహర్‌నగర్ పరిధిలోని బజరంగ్ కాలనీ, అంబేద్కర్ నగర్‌లో రూ.31 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో డ్రైనేజీ, రహదారుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పల్లె సత్యం, మాజీ కార్పొరేటర్లు కుతాడి శ్రీకాంత్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, సంగారెడ్డి శారద, మనోహర్ రెడ్డి, కృష్ణ గౌడ్, మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు మాట్లా శ్రీనివాస్, జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మాట్లా వినయ్, ప్రధాన కార్యదర్శి డీఎస్ఎస్ వెంకటేశ్వర్లు, గజ్వేల్ శంకర్, నాయకం భాస్కర్, కోశాధికారి పొలాస కిరణ్, అబ్బాగోని రాజు గౌడ్, మెట్టు వెంకన్న, జడల బాలకృష్ణ, సత్యనారాయణ, రాజు యాదవ్, జాన్, విజయరాయ్, మాధవరెడ్డి తదితరులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



విదేశాల్లో నర్సింగ్ విద్యకు ఎంతో ప్రాధాన్యత... రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

ఆశా ఫౌండేషన్ ద్వారా నర్సింగ్ విద్యార్థినులకు పుస్తకాలు, మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి



ఖమ్మం అక్టోబర్ 30 నిర్భయవార్త రిపోర్టర్. నర్సింగ్ విద్యకు జర్మనీ లాంటి విదేశాల్లో ఎంతో ప్రాముఖ్యత ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి సత్తుపల్లి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల లో ఆశా ఫౌండేషన్ ద్వారా నర్సింగ్ విద్యార్థినులకు పుస్తకాలు, మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జర్మనీ లాంటి విదేశాల్లో నర్సింగ్‌కు విపరీతమైన డిమాండ్ ఉన్నందున, మన విద్యార్థులకు జర్మన్ లాంగ్వేజ్ నేర్పిస్తే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కంటే ఎక్కువ వేతనాలు పొందవచ్చనే ఉద్దేశంతో ఆ శిక్షణను కూడా కాలేజీల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.హూపాలేరు నియోజకవర్గంలో అత్యాధునిక సదుపాయాలతో కూడిన నర్సింగ్ కాలేజీని పూర్తిస్థాయిలో నిర్మించి ప్రారంభించడం జరిగిందని, సత్తుపల్లి నియోజకవర్గానికి సంబంధించిన నర్సింగ్ కాలేజీని కూడా సుమారు రూ. 19 కోట్ల వ్యయంతో, అతి త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంత్రి అన్నారు. రాబోయే కొద్ది రోజుల్లోనే నర్సింగ్ కాలేజీకి కావలసిన ఫ్యాకల్టీని కూడా పూర్తిగా సమకూర్చడం జరుగుతుందని అన్నారు.డాక్టర్ తర్వాత అంతటి ప్రాధాన్యత నర్సింగ్ వృత్తికి ఉంటుందని, రోగులకు మెరుగైన సేవలు అందిస్తూ కాలేజీకి, ప్రాంతానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకొని రావాలని విద్యార్థులను కోరారు. ఆశా ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు కావలసిన స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయమని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, సత్తుపల్లి మునిసిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్ పాషా, కళాశాల ప్రిన్సిపాల్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలకు రూ.67.75 లక్షలు

అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధుల మంజూరు



ఉప్పల్, అక్టోబరు 30 నిర్భయవార్త ప్రతినిధి :ఉప్పల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.67.75 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో నాబార్డు ఆర్ఐడీఎఫ్ XXVIII పథకం కింద ఐదు తరగతి గదుల నిర్మాణానికి నిధులు కేటాయించారు.విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడంతో పాటు, పాఠశాలలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు ఈ నిధులు దోహదపడనున్నాయి. నిధుల మంజూరుకు సహకరించిన ప్రభుత్వానికి, అధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పెండింగ్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఎంఎంసీ కమిషనర్‌తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చర్చలు



ఉప్పల్, అక్టోబర్ 30 నిర్భయవార్త ప్రతినిధి : ఉప్పల్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్ సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు ఎంఎంసీ కమిషనర్ విజయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు.నియోజకవర్గంలోని రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల కల్పనపై వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. ఉప్పల్ సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు ఆర్థిక చేయూత.

– రూ.93,200లను పిల్లల పేరిట బ్యాంకులో జమ చేసిన గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి




జన్నారం, అక్టోబరు 30, నిర్భయవార్త ప్రతినిధి :తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన ఇద్దరు చిన్నారులకు తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి (టీజీడబ్ల్యూడబ్ల్యూసీ) రాంపూర్ కమిటీ ఆర్థిక చేయూత అందించింది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ఓరగంటి (మోతే) దివ్య భర్త లింగయ్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల దివ్య కూడా అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుమార్తెలు అమూల్య (11), స్పందన (9) తల్లిదండ్రుల ఆదరణకు దూరమయ్యారు. విషయం తెలుసుకున్న తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాంపూర్ కమిటీ సభ్యులు, దాతల సహకారంతో రూ.93,200 సేకరించారు. ఆ మొత్తాన్ని చిన్నారుల భవిష్యత్తు అవసరాల కోసం వారి పేరిట బ్యాంకులో స్థిర నిక్షేపంగా జమ చేశారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కల్లెడ భూమయ్య మాట్లాడుతూ.. ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని చిన్నారులు ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గల్ఫ్ కార్మికులకు, గ్రామ ప్రజలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర కన్వీనర్ సుదర్శన్, గ్రామ అధ్యక్షుడు లింగాల వెంకటేష్ తెలిపారు. ఈ సాయం అందించేందుకు విదేశాల్లో ఉంటూ పరోక్షంగా సహకరించిన ఓరగంటి వెంకటేష్, సంతపురి రమేష్, కల్లెడ లచ్చయ్య, పందిరి రాజేష్, కొండ్ర నారాయణలకు భూమయ్య కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సర్పంచి నూతి రామయ్య, మాజీ సర్పంచి అలుగునూరి పద్మారావు సమితి రాంపూర్ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సంతపురి రాజేష్, రేషవేని లచ్చన్న, చిరంజీవి, వెంకటేష్, అరుణ్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

9.34 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు

మంచిర్యాల, అక్టోబర్ 30, నిర్భయవార్త ప్రతినిధి :: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 24వ విడతను శుక్రవారం విడుదల చేసినట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు.గుజరాత్‌లోని బిల్డీ పట్టణం నుంచి 9.34 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ.18,680 కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. 2019లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందుతోందన్నారు. సకాలంలో ఆర్థిక సాయం అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి జిల్లా రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

మంచిర్యాలలో డీఆర్‌యూ గోల్డ్ 25వ శాఖ ప్రారంభం

అందుబాటులో కి బంగారం, వెండి కొనుగోలు, తాకట్టు బంగారం విడిపించే సేవలు.




మంచిర్యాల, అక్టోబరు 30, నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్‌కు చెందిన బంగారం, వెండి కొనుగోలు, పునర్వినియోగం, తాకట్టు బంగారం విడిపించే సేవల సంస్థ డీఆర్‌యూ గోల్డ్ తన 25వ శాఖను మంచిర్యాలలో ప్రారంభించింది. శుక్రవారం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి మేయర్ దర్నె మధుకర్, కార్పొరేటర్ మాడంశెట్టి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మేయర్ చేతుల మీదుగా నూతన శాఖ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, వినియోగదారులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. వెంకటేశ్వర్ థియేటర్ చౌరస్తా సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా, చింతలండువాడలో ఈ శాఖను ఏర్పాటు చేశారు. వినియోగంలో లేని పాత బంగారం, వెండిని విక్రయించి నగదు పొందే సదుపాయాన్ని సంస్థ కల్పిస్తోంది. వినియోగదారుల సమక్షంలోనే బంగారాన్ని పరీక్షించి, కరిగించి, తూకం వేసి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో స్వచ్ఛతను నిర్ధారించిన అనంతరం మార్కెట్ ధరకు అనుగుణంగా విలువ చెల్లిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. నగదును నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేసే సదుపాయం ఉందన్నారు.బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, వడ్డీ వ్యాపారుల వద్ద తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించుకునేందుకు కూడా సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా తొలి మూడు రోజుల పాటు సాధారణంగా వసూలు చేసే మూడు శాతం సేవా రుసుమును 1.5 శాతానికి తగ్గించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సంస్థ ఏవీపీ (ఆపరేషన్స్) శివకుమారి మాట్లాడుతూ తెలంగాణలో బంగారం మార్కెట్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, వినియోగదారుల విశ్వాసమే సంస్థ విస్తరణకు ప్రధాన బలమని అన్నారు. మంచిర్యాలలో 25వ శాఖను ప్రారంభించడం సంస్థ ప్రయాణంలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. పారదర్శకత, న్యాయమైన ధరలు, నాణ్యమైన సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 30 వేల మందికి పైగా వినియోగదారులకు సేవలందించిన సంస్థ, 2027 మార్చి నాటికి మరో 15 శాఖలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు

జవహర్ నగర్‌లో మేగా రక్తదాన శిబిరం: స్వచ్ఛందంగా పాల్గొనాలని ప్రజలకు పోలీస్ శాఖ పిలుపు

జవహర్ నగర్ నిర్భయవార్త ప్రతినిధి : జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు పోలీస్ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీస్ అమరవీరుల దినోత్సవాల ముగింపు సందర్భంగా రేపు (శనివారం, అక్టోబర్ 31) ఉదయం 9:00 గంటలకు జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు.అంబేద్కర్ నగర్‌లోని రోజ్ గార్డెన్ (ఫ్లవర్ ఫంక్షన్ హాల్) వేదికగా ఈ మేగా రక్తదాన శిబిరం జరగనుంది. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డివిజన్ ఏసీపీ చక్రపాణి గారు, జవహర్ నగర్ పోలీస్ ఇన్స్పెక్టర్ గారితో పాటు స్టేషన్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొననున్నారు.సామాజిక సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న ఈ రక్తదాన శిబిరంలో జవహర్ నగర్ మరియు దాని పరిసర ప్రాంతాల ప్రజలు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి విజయవంతం చేయాలని పోలీస్ అధికారులు కోరారు.

గోరిగె శ్రీకాంత్‌ను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే ఎన్విఎస్ఎస్ ప్రభాకర్



ఉప్పల్, అక్టోబరు 30 నిర్భయవార్త ప్రతినిధి :భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) మెదక్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా కార్యదర్శిగా నియమితులైన గోరిగె శ్రీకాంత్ ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్విఎన్ఎస్ ప్రభాకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ శ్రీకాంత్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.తనకు జిల్లా కార్యదర్శిగా అవకాశం కల్పించిన ప్రభాకర్‌తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గిరి వర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోరిగె కృష్ణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరి శ్రీనాథ్, మహంకాళి లక్ష్మణ్, రావుల బాలకృష్ణగౌడ్, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డికి శ్రీకాంత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ యువతను పార్టీకి చేరువ చేస్తానని పేర్కొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు తగిన బుద్ధి చెప్పాలిబీజేపీ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి



మధిర అక్టోబర్ 30 నిర్భయవార్త ప్రతినిధి :రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి, ఆ రెండు పార్టీలకు పట్టభద్రులు తగిన బుద్ధి చెప్పాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షులు కొండవల్లి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం మధిర పట్టణంలోని శీలం పుల్లారెడ్డి విద్యాసంస్థను ఆయన నందర్శించి,ఉపాధ్యాయులు మరియు సిబ్బందితో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.గత శాసనసభ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు,ఏకంగా 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ..ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని శ్రీధర్ రెడ్డి విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో ఏవిధంగానైతే ప్రజా సమస్యలు తాండవించాయో, నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ అవే సమస్యలు పునరావృత్తమవుతున్నాయని,పాలకుల పేర్లు మారినా పేదల తలరాతలు మారడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు,ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు విద్యావంతులు,పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో చైతన్యవంతమైన పాత్ర పోషించాలని కోరారు.నవంబర్ 6లోపు పట్టభద్రుల ఓటరు నమోదు పూర్తి కావాలిలిఅర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చొరవ చూపాలని శ్రీధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.రాబోయే నవంబర్ 6వ తేదీలోపు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను ప్రతి ఒక్కరూ పూర్తి చేసుకోవాలని సూచించారు. శీలం పుల్లారెడ్డి విద్యాసంస్థకు చెందిన ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా ఓటరు నమోదు చేయించుకోవడంతో పాటు, చుట్టుపక్కల ఉన్న అర్హులైన ఇతర పట్టభద్రులకు కూడా ఈ అంశంపై అవగాహన కల్పించాలని కోరారు.రాజ్యాంగ సంస్థలపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలిఇటీవల కాలంలో దేశంలో రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే విధంగా కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయని కొండపల్లి శ్రీధర్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.గోబెల్స్ ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని,ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియపై కాంగ్రెస్,దాని అనుబంధ పార్టీలు చేస్తున్న విషప్రచారాన్ని ప్రజలు వాస్తవాల ఆధారంగా తిప్పికొట్టాలని సూచించారు.విదేశీ శక్తుల తోడ్పాటుతో మూకస్వామ్య ధోరణులను ప్రోత్సహిస్తూ, మన ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచేందుకు కుట్రలు జరుగుతున్నాయని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో మేధావులు, విద్యావంతులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాజ్యాంగ సంస్థలపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని చెడగొట్టేలా జరుగుతున్న ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ,వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత విద్యావంతులైన పట్టభద్రులపైనే ఉందని ఆయన

పెండింగ్ దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలి

– అదనపు కలెక్టర్ వి.రాములు



మంచిర్యాల, అక్టోబరు 30, నిర్భయవార్త ప్రతినిధి :ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నస్పూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ పనుల పురోగతిని సమీక్షించారు. జీఓ నంబర్లు 76, 59, ఎస్ఐఆర్ ప్రక్రియ, భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, మీ–సేవ ద్రువపత్రాల దరఖాస్తుల పరిష్కారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ ఫైళ్లను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని, రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలి

– కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, అక్టోబరు 30, నిర్భయవార్త ప్రతినిధి : ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం దండేపల్లి, జన్నారం మండలాల్లో పర్యటించి పాఠశాలలు, కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు.
దండేపల్లి జూనియర్ కళాశాల అసంపూర్తి భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, పదో తరగతి విద్యార్థులకు గణిత పాఠాలు బోధించి వారి అభ్యసన స్థాయిని పరిశీలించారు. ఆసుపత్రుల్లో వైద్యులు సమయపాలన పాటిస్తూ గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జన్నారం ఆశ్రమ పాఠశాల, కేజీబీవీల్లో నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. జన్నారం ప్రాంతంలో డెంగ్యూ నివారణకు నీటి నిల్వలను తొలగించి, నీటి నమూనాలను పరీక్షించాలని సూచించారు. భూభారతి దరఖాస్తులు, పెండింగ్ రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి.

జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 నిర్భయవార్త ప్రతినిధి : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసించే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వంటగది, వంట సామాగ్రి, సరుకుల నిల్వల గదిని పరిశీలించారు. వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థినులు, పనిచేస్తున్న వంట సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వంటగది మూత్రశాలలు స్నానపు గదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జాదవ్ అంబాజీ, వసతి గృహ సంక్షేమ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన క్రీడా విద్యార్థులకు క్రీడా కిట్లు పంపిణీ.

జిల్లా కలెక్టర్ కె హరిత.



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 నిర్భయవార్త ప్రతినిధి : జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కె హరిత శుక్రవారం క్రీడా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వయంగా విద్యార్థులకు కిట్లను పంపిణీ చేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల నిరంతర సాధనతో క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా సామాగ్రి అందించేందుకు సిఎస్ఆర్ నిధుల ద్వారా సహకరించిన సంస్థల ప్రతినిధులను అభినందించారు. గిరిజన క్రీడా పాఠశాలలోని విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ప్రతిభను చాటాలని, జిల్లా నుండి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు కోట్నాక విజయ్, డీఎఫ్ఓ షేకు, పిడి మీనారెడ్డి, గిరిజన క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింభారావు, ఎస్ జి ఎఫ్ కార్యదర్శి రామ్మోహన్, హెచ్ డబ్ల్యు ఓ విజయలక్ష్మి, కోచ్ లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, గుండా లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ను రద్దు చేయాలి.

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి.
పీడీఎస్యు డిమాండ్.

ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 నిర్భయవార్త ప్రతినిధి : ఎస్,ఐ,ఆర్, రద్దు చేసి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా



చేయాలని పిడిఎస్యు నాయకులు డిమాండ్ చేశారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ పిడిఎస్యు కార్యాలయం లో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఈసిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతుందని, మూడో విడత ఎస్ఐఆర్ ముసాయిరా ఓటరు జాబితా లు దేశవ్యాప్తంగా 13 కోట్లకు పైగా ప్రజల పేర్లు జాబితాల నుండి తొలగించబడ్డట్లు తెలిసిన విషయమే, తెలంగాణ రాష్ట్రంలో కూడా సుమారు 73 లక్షల 39 వేల ఓటర్లను తొలగించినట్టు ఘనంకలు తెలియజేస్తున్నాయని అన్నారు. బిజెపి హేతర రాష్ట్రాల్లో ఓట్లను తొలగించడం జరుగుతుందని అన్నారు. తొలగించిన ఓట్లకు బాధ్యత వహిస్తూ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా గత నెల రోజులుగా విద్యార్థి యువత రోడ్లపై ఉద్యమాలు నిర్వహిస్తుంటే కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరి ఓటు కాపాడాలని, భవిష్యత్తులో బిజెపి పార్టీని గద్దె దించేంతవరకు విద్యార్థి యువత పోరాడుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు మండల ప్రధాన కార్యదర్శి తరుణ్, వంశీ, సుమంత్, దేవరాజ్, ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ 68 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు: ఎమ్మెల్యే

తాండూర్ అక్టోబర్ 30:నిర్భయవార్త ప్రతినిధి : రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కోటి 76 లక్షలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి శుక్రవారం రోజు రెడ్డి ఘనాపూర్ మంతటి నవల్గా గ్రామాలలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన అనంతరం కోటి 76 లక్షలు లక్షల నిధులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. 10 లక్షల రూపాయలతో ప్రారంభం 13 లక్షల రూపాయలతో ఎంపీపీ ఎస్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలల కాంపౌండ్ నిర్మాణం, వివిధ గ్రామాలలో సిసి రోడ్లు ఫార్మేషన్ రోడ్లు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమాలలో పిఎసిఎస్సి అధ్యక్షురాలు కరుణ. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శంకరప్ప తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సహదబేగం ఎంపీడీవో సంపత్ కుమార్ నవలగా సర్పంచులు వెంకటమ్మ బషీరాబాద్ ఎస్. వెంకటేష్, రెడ్డి గానాపూర్ సర్పంచ్ బసంత్, జిల్లా కాంగ్రెస్ నాయకులుకె. నర్సింలు గౌడ్ కాంగ్రెస్ నాయకులు వెంకటరామిరెడ్డి, అజయ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నుఎమ్మెల్యే ప్రారంభించారు.చిన్న యరసాల అభివృద్ధికి అవకాశం ఇవ్వండి.. 'విండో ఏసీ' గుర్తుకు ఓటేయండి



గ్రామ ప్రగతే ధ్యేయం.. ప్రజల ఆశీస్సులే బలంగా స్వతంత్ర అభ్యర్థి హర్షవర్ధన్ రెడ్డి

పోరుమామిళ్ల,అక్టోబర్ 30 నిర్భయవార్త ప్రతినిధి : కడప జిల్లా పోరుమామిళ్ల మండలం చిన్న యరసాల పంచాయతీ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. నిరుపేదలు, సామాన్యుల పక్షాన నిలబడి, గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపించడమే ధ్యేయంగా పాలకొలను హర్షవర్ధన్ రెడ్డి చిన్న యరసాల వీూజ స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవ చేయాలనే పట్టుదలతో ఆయన ఈ నిర్ణయం తీసుకు న్నారు.జీవనోపాధి కోసం వెళ్లినా.. సొంత ఊరిపై మమకారంతో:పాలకొలను హర్షవర్ధన్ రెడ్డి కుటుంబ వారనత్వం, బంధుమిత్రులంతా ఇక్కడే, వీరు జీవనోపాధి నిమిత్తం రామిరెడ్డి కుంట



ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చింది. అక్కడ ఉన్నా మాత్రాన సొంత గడ్డ అయిన చిన్న యరసాల గ్రామ ప్రజల కష్టసుఖాలు, ఊరి అభివృద్ధిపై వారికి ఎనలేని మమకారం ఉంది. మాతృభూమికి, ఇక్కడి ప్రజలకు ఏదైనా మంచి చేయాలనే తపనతోనే



హర్షవర్ధన్ రెడ్డి నేడు మీ ముందుకు వచ్చారు.మీరే నా బలం.. మీరే నా ధైర్యం:ఆయన "చిన్న యరసాల గ్రామ ప్రజల ఆశీస్సు లు, మద్దతు నాకు ఎల్లవ్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రజల అండదండలే నాకు కొండంత బలం మరియు ధైర్యం" అని హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా, కేవలం ప్రజా సేవకు అంకితమవ్వడమే తన ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.రాబోయే 05-11-2026 న జరగబోయే ఎన్నికలలో పోలింగ్ కేంద్రానికి వెళ్లి, 'విండో ఏసీ' గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో తనును గెలిపించాలని ఆయన గ్రామ ఓటర్లను, పెద్దలను, యువకులను భక్తిపూర్వకంగా ప్రార్థిస్తున్నారు. మన ఓటు ద్వారానే అభివృద్ధికి బాటలు వేసుకుందామని, చిన్న యరసాల పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్

20 ఏళ్ల యువతికి పక్షవాతం..

యశోద వైద్యుల సమయస్ఫూర్తితో ప్రాణరక్షణ!

నల్లగొండ, అక్టోబర్ 30 నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రి మలక్‌పేట వైద్యులు అరుదైన కేసులో 20 ఏళ్ల యువతికి విజయ వంతంగా చికిత్స అందించారు. అకస్మాత్తుగా మాట వడిపోవడం, చేయి, కాలు బలహీనపడటంతో ఆసుపత్రికి వచ్చిన యువతికి పక్షవాతంగా గుర్తించారు.రెండు వైద్య విభాగాల నివుణులు నమన్వయంతో అత్యవనర చికిత్స అందించి యువతి ఆరోగ్యాన్ని మెరు గ ుపరిచారు.యువతలోనూ పక్ష వాతం వచ్చే అవక ాశం !అకస్మాత్తుగా మాట తడబడటం, చేయి లేదా కాలు బలహీనపడటం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి రావాలని వైద్యులు సూచించారు.ఈ వివరాలను నల్లగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యశోద ఆసుపత్రి వైద్యులు డాక్టర్ జయ ఆదిత్య ఫహాద్, డాక్టర్ సూరిరెడ్డి భరత్ కుమార్ వెల్లడించారు.



సాగర్ రోడ్డుకు మహర్దశ.. మేయర్ బుర్రి చైతన్య చేతుల మీదుగా ఆరు లైన్ల రోడ్డు పనులకు శ్రీకారం!

నల్లగొండ, అక్టోబర్ 30 నిర్భయవార్త ప్రతినిధి : నల్లగొండ నగరాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అన్ని డివిజన్లలో పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నగరంలో కోట్లాది రూపాయలతో మౌలిక వనతుల వనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.శుక్రవారం సాగర్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు సుమారు 3.5 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు మేయర్ స్థానిక కార్పొరేటర్, పార్టీ నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రమాదాల నివారణకు



డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ పనుల కోసం మంత్రి కోమటిరెడ్డి ఆర్అండ్బీ శాఖ నుంచి రూ.20 కోట్లు మంజూరు చేశారని వెల్లడించారు.పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించడంతో పాటు పానగల్ నుంచి డీఈఓ కార్యాలయం వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపారు. బ్రహ్మంగారి గుట్ట, లతీఫ్ సాబ్ గుట్టలకు ఘాట్ రోడ్ల నిర్మాణం ద్వారా పర్యాటక, ఆధ్యాత్మిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మంత్రి సహకారానికి నగర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఏడాదిలో నల్లగొండ రూపురేఖలు మారుస్తాంమాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి కోమటిరెడ్డి సహకారంతో నల్లగొండలో సుమారు రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఏడాదిలో నగర రూపురేఖలు మారతాయని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు జరుగుతున్నా ప్రతిపక్షాలు సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలు అలాంటి ప్రచారాలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ అమేర్, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ పాలకూరి సుమలత సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, పలువురు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీ స్వామి అయ్యప్ప అన్నదానం సేవా సమితిలో ఆర్.వి. స్వామి సిండికేట్ అన్నదానం





మధిర అక్టోబర్ 28 నిర్భయవార్త ప్రతినిధి : మున్సిపాలిటీ పరిధిలో శ్రీ దివ్య శిరిడి సాయిబాబా ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన స్వామి అయ్యప్ప మాలధారులకు భవాని దీక్షలకు గోవింద స్వాములకు దాతలు సహకారంతో శ్రీ స్వామి అ య్యప్పస్వామి అన్నదాన సే వా సమితి ఆర్ వి స్వా మి సిండికేట్ ఆధ్వర్యంలో 44 రోజులు దీక్ష లో దాతలు సహకారంతో మహా అన్నదానం కా ర్యక్రమం నిర్వ హిస్తు న్నారుదాతలు అన్నదా నం కార్యక్రమాన్ని ప్రారంభించారు దాతల అబ్బూరి రామకృష్ణ లేటు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ స్వామి అయ్యప్ప అన్నదానం కార్యక్రమంలో పాల్గొనటం అన్నదానం నిర్వహించటం అన్నం పరబ్రహ్మ స్వరూపనేని అన్నదానం చేయటం వల్ల ఆ స్వామి అయ్యప్ప ఆశీస్సులు అందరికీ ఉండాలనిదాతల సహాయ సహకారాలతో 44 రోజుల పాటు నిర్వహించనున్న ఈ పవిత్ర అన్నదాన కార్యక్రమం విజయవంతం కావాలని స్వామివారిని ప్రార్థిస్తున్నాము.ఆర్.వి. స్వామి సిండికేట్ సభ్యులు సేవకులు పాల్గొన్నారు

మోటమర్రి రైల్వే బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్



మధిర రూరల్ అక్టోబర్ 30 నిర్భయవార్త ప్రతినిధి :.మోటమర్రి గ్రామంలో ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జి ఆర్వో ఆర్ బి నిర్మాణ పనుల నిమిత్తం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ స్థల పరిశీలన చేపట్టారు.బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఆయన గురువారం గ్రామానికి విచ్చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు మరియు గ్రామ పెద్దలకు పలు సూచనలు చేశారు.రైల్వే బ్రిడ్జి అందుబాటులోకి వస్తే మోటమర్రి మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజల రవాణా ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయని, పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మోటమర్రి గ్రామ గౌరవ సర్పంచ్ మర్రి సురేష్ , గౌరవ ఉప సర్పంచ్ బక్క కిరణ్ కుమార్ స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు మరియు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దాడి కేసులో ఏడాది శిక్ష ఖరారు

మధిర అక్టోబర్ 30 నిర్భయవార్త ప్రతినిధి : 2020 లో మధిర పట్టణ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో శుక్రవారం మధిర ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ దీప్తివేముల శిక్షను ఖరారు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.తనపై వాగ్వాదానికి దిగి దాడి చేశారని పేర్కొంటూ మధిర మండలం దేశినేని పాలెం గ్రామానికి చెందిన పార ప్రభాకర్ పారా ఈశ్వరమ్మ అనే దంపతులపై ఇదే గ్రామానికి చెందిన తంబాల మల్లేశ్వరి అనే మహిళ 2020 సెప్టెంబర్ 10న మధిర పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాటి ఎస్ హెచ్ ఓ వి.ఉదయ్ కుమార్ నిందితులపై 323 354(బి) 294 (బి) 324 ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు పై విచారణ నిర్వహించిన మధిర ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ దీప్తి వేముల నిందితులపై ఆరోపించబడిన ఆరోపణ లలో పార ప్రభాకర్ పై సెక్షన్ 323 ప్రకారం మాత్రమే నేరం రుజువు కావడంతో ఒక ఏడాది సాధారణ జైలు శిక్ష లేదా వెయ్యి రూపాయల జరిమానాను విధిస్తూ, రెండో ముద్దాయిగా ఉన్న ఈశ్వరమ్మను నిర్దోషిగా పేర్కొంటూ శుక్రవారం జడ్జి తీర్పు వెలువరించారు. ఈ కేసును ఏపీపీ జున్ను భద్రయ్య ప్రాసిక్యూషన్ నిర్వహించగా మధిర పట్టణ సీఐ దోమల రమేష్ లైసన్ ఆఫీసర్ కే శ్రీకాంత్ (ఎస్సై) కోర్టుపిసి కృష్ణమోహన్ సహకరించారు. కాగా కోర్టు విధించిన శిక్షలో భాగంగా వేయి రూపాయల జరిమానాను ప్రభాకర్ చెల్లించినట్లు కోర్టు పిసి కృష్ణమోహన్ తెలిపారు.

డాక్టర్ ఆర్‌వీఆర్ ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో

ఘనంగా ENGINEERING FOR IMPACT -- 2026" ప్రాజెక్ట్ ఎక్స్‌పో





నిర్భయవార్త ప్రతినిధి :ఆగిరిపల్లి, అక్టోబర్ 30: డాక్టర్ ఆర్‌వీఆర్ ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ)లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ ýÉ•+>) $uê>+ €<ÇÁ+ýË n¿Ã/sY30, 2026q »»ENGINEERING FOR IMPACT -- 2026" పేరుతో ప్రాజెక్ట్ ఎక్స్‌పోను ఘనంగా నిర్వహించారు. »»From Student Innovation to Real-World Solutionsµµ అనే నినాదంతో నిర్వహించిన ఈ ఎక్స్‌పో విద్యార్థుల సృజనాత్మకతకు, సాంకేతిక ప్రతిభకు వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థులు వివిధ సాంకేతిక రంగాలకు సంబంధించిన తమ వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. ముఖ్యంగా క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), మెషిన్ లెర్నింగ్ (ML), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (IT) తదితర రంగాలలో రూపొందించిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తమ ప్రాజెక్టుల రూపకల్పన, సాంకేతిక పనితీరు, వాస్తవ ప్రపంచ సమస్యలకు అవి అందించే పరిష్కారాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా Quantum Valley Amaravati ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీ వెంకట స్వామి తాడికొండ గారు, ఇండియన్ సర్వర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ శ్రీ సాయి సతీష్ గారు పాల్గొన్నారు. వీరితో పాటు సంస్థ ప్రో ఛాన్సలర్లు డాక్టర్ సి. నాగభాస్కర్ గారు, డాక్టర్ జి. సాంబశివరావు గారు, సంస్థ సీఈఓ శ్రీ తేజ సాయి గారు, రిజిస్ట్రార్ డాక్టర్ రాఘవరావు గారు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ముఖ్య అతిథులు, ప్రో ఛాన్సలర్లు, సీఈఓ గారు విద్యార్థుల వినూత్న ఆలోచనలు, సాంకేతిక ప్రతిభను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని నూతన ఆవిష్కరణలు చేపట్టాలని ప్రోత్సహించారు. విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించి, వాటి సాంకేతికత, ఆచరణాత్మక ఉపయోగాలు, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసుకునే అవకాశాలపై విలువైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా సంస్థ ఛాన్సలర్ డాక్టర్ ఆర్. వెంకట్ రావు గారు, వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.ఆర్.ఎస్. సాంబశివరావు గారు విద్యార్థులను, విభాగాధిపతిని, అధ్యాపక బృందాన్ని అభినందిస్తూ తమ ప్రోత్సాహాన్ని అందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. అలాగే కళాశాలలోని వివిధ విభాగాల అధిపతులు (HOD\T), అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించారు. తమ అనుభవం, నైపుణ్యంతో విలువైన సూచనలు అందిస్తూ విద్యార్థులను మరింత మెరుగైన ప్రాజెక్టుల రూపకల్పనకు ప్రోత్సహించారు. ఈ ప్రాజెక్ట్ ఎక్స్‌పో విజయవంతం కావడానికి సహకరించిన కళాశాల యాజమాన్యానికి, గౌరవనీయులైన ఛాన్సలర్, ప్రో ఛాన్సలర్లు, వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, సీఈఓ గార్లకు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ూ× ఉ మీ) విభాగం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. అలాగే ముఖ్య అతిథులకు, వివిధ విభాగాల అధిపతులకు, అధ్యాపకులకు, విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపింది. ఈ కార్యక్రమాన్ని విభాగాధిపతి మరియు అధ్యాపక బృందం సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణ కార్యదర్శిగా డాక్టర్ బి. హెచ్. దశరథ రామ్ వ్యవహరించారు.



2,23,183 పెన్షన్లకు రూ. 96.93 కోట్ల లబ్ధి

- పంపిణీ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:ఎన్‌టీఆర్ జిల్లాలో 2,23,183 పెన్షన్లకు మొత్తం రూ. 96.93 కోట్ల లబ్ధి జరుగుతోందని.. పెన్షన్ల పంపిణీ ప్రక్రియ సజావుగా జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం కంచికచర్ల మండలం, పరిటాల గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పరిశీలించారు. లబ్ధిదారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ద్వారా పంపిణీ కార్యక్రమం సజావుగా జరుగుతుందా.. లేదా? అనేది పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సామాజిక భద్రత లక్ష్యంగా అమలవుతున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు, నిర్లక్ష్యానికి తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించేందుకు సిబ్బందికి దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. పెన్షన్ల పంపిణీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో అనుక్షణం పర్యవేక్షిస్తూ లోటుపాట్లు లేకుండా చూస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో నందిగామ ఆర్‌డీవో అనిల్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్

నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ:జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్ శుక్రవారం ఇబ్రహీంపట్నం, విజయవాడ గ్రామీణ మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల వ్యయ నిర్వహణ స్థితిగతులను, వ్యయ పర్యవేక్షణ బృందాల మోహరింపుపై సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలకు షిఫ్టుల వారీగా సజావుగా విధులు నిర్వర్తించేందుకు అవసరమైన వాహనాలు, ఇతర వనరులపైనా సమీక్షించారు. నిరంతర నిఘా కొనసాగించాలని సిబ్బందిని ఆదేశించారు. షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లతో ఖర్చులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని.. అభ్యర్థులకు ఇచ్చిన ప్రచార అనుమతుల వివరాలను వ్యయ పర్యవేక్షణ, అకౌంటింగ్ బృందాలకు తప్పనిసరిగా అందజేయాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే నగదు, మద్యం, కానుకల పంపిణీని అడ్డుకునేందుకు తనిఖీలను ముమ్మరం చేయాలని.. అందిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు వ్యయ పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని.. ఇందుకు క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని విజయ్ కుమార్ సూచించారు



నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి -- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ: అక్టోబర్ 30,2026.:ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రచార గడువు ముగిసిన వెంటనే అన్ని రకాల ప్రచార కార్యక్రమాలను నిలిపివేయాలని స్పష్టం చేశారు. బహిరంగ ప్రచారాలు, మైకుల వినియోగంపై నిషేధం ప్రచార గడువు ముగిసిన తర్వాత ఎలాంటి బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహించరాదు. మైకులు, లౌడ్‌స్పీకర్ల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలి. ఫేస్‌బుక్ లైవ్, జూమ్, గూగుల్ మీట్ తదితర ఆన్‌లైన్ వేదికలు, సోషల్ మీడియా ద్వారా కూడా ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి వీల్లేదని తెలిపారు. ఎన్నికలు జరిగే డివిజన్లు, వార్డులకు చెందని రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రచారకులు తక్షణమే ఆయా ప్రాంతాలను విడిచి వెళ్లాలని ఆదేశించారు. ఇంటింటి ప్రచారాలు, అనుమతి లేని సమావేశాలు జరగకుండా నిఘా బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తాయని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మద్యం లేదా ఇతర బహుమతులు పంపిణీ చేయడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గుర్తించి, ఎన్నికల చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. పురపాలక ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, భయాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



వికసిత్ భారత్ @2047 లక్ష్య సాధనలో సుస్థిర మౌలిక వసతులు కీలకం

- జాతీయ సదస్సులో ముఖ్యోపన్యాసం చేసిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



నిర్భయవార్త ప్రతినిధి : విజయవాడ:దేశంలో సుస్థిరమైన, తక్కువ కర్బన ఉద్గారాలు కలిగిన, వాతావరణ మార్పులను తట్టుకోగల పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు నిర్మాణ రంగం, పట్టణ ప్రణాళిక, రియల్ ఎస్టేట్, సుస్థిర మౌలిక వసతుల మధ్య సమన్వయం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు.జాతీయ ప్రాధాన్యత కలిగిన విద్యాసంస్థ విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్‌పీఏ).. నీడ్ మిషన్ సహకారంతో శుక్రవారం ఎస్‌పీఏలో "నిర్మిత పర్యావరణంలో నికర శూన్య కర్బన ఉద్గారాలు: భవనాల నుంచి నగర ప్రాంతాల వరకు – వికసిత్ భారత్ ఏ2047 లక్ష్యంగా నిర్మాణ శాస్త్రం, పట్టణ ప్రణాళిక, రియల్ ఎస్టేట్, సుస్థిర మౌలిక వసతుల సమన్వయం" అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహించింది. ఈ సదస్సులో ప్రముఖులు, విద్యావేత్తలు, ప్రభుత్వ అధికారులు, వృత్తి నిపుణులు, పరిశోధకులు, పారిశ్రామిక ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని దేశంలో సుస్థిర అభివృద్ధి, తక్కువ కర్బన ఉద్గారాలు, వాతావరణ మార్పులను తట్టుకోగల నిర్మాణ వ్యవస్థల అభివృద్ధిపై చర్చించారు. నదన్సులో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సుస్థిర పట్టణాభివృద్ధి, నమన్వయ పాలన, మౌలిక వనతుల కల్పన, అభివృద్ధి కార్యక్రమాల్లో పర్యావరణ పరిరక్షణ అంశాలను అంతర్భాగం చేయడం ద్వారా వికసిత్ భారత్ ఏ2047 లక్ష్య సాధనకు దోహదపడుతుందని వివరించారు.పటిష్ట సమన్వయంతో వ ర్యావారణ నవాళ్లను ఎదుర్కొందాం:ఎస్‌పీఏ విజయవాడ ఆర్కిటెక్చర్ విభాగాధిపతి ప్రొఫెసర్ అమితవ సర్కార్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడంలో నిర్మాణ రంగం, పట్టణ ప్రణాళిక, అనుబంధ రంగాల మధ్య సమన్వయం, పరస్పర సహకారం అవనరమన్నారు. ఎన్‌పీఏ విజయవాడ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. రమేష్ శ్రీకొండ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, నిర్మిత వర్యావరణ రంగంలో వినూత్న విధానాలను ప్రోత్సఎ ించేందుకు సంస్థ కట్టుబడి ఉందన్నారు. అన్నా విశ్వవి ద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ మాజీ డీన్ డాక్టర్ మోన్సింగ్ దేవదాస్.. సుస్థిర, పర్యావరణహిత అభివృద్ధి, నిర్మాణ పద్ధతుల ప్రోత్సాహంలో నిర్మాణ విద్య, పరిశోధనలు, వృత్తిపరమైన అనుభవాల పాత్రను వివరించారు. విభా సెక్రటరీ జనరల్ పి. ఏ.వివేకానంద మాట్లాడుతూ దేశ దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమష్టి భాగస్వామ్యం, నంస్థల మధ్య నహకారం, విజ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడం ఎంతో అవసరమన్నారు. స్టూడియో చింతల అధిపతి, ఆర్కిటెక్ట్ దివాకర్ చింతల తన పరిశోధన ప్రాజెక్టులైన ఈపాజిటివ్ ల్యాబ్స్, అమరరాజా పరిశోధనా కేంద్రం, అమెరికాలో జెన్సర్ సంస్థ ద్వారా చేపట్టిన నియర్ జీరో కమర్షియల్ బిల్డింగ్ ప్రాజెక్టుల గురించి తన అభిప్రాయాలను వంచుకున్నారు.నదన్సులో ప్రధానంగా విద్య, ఆరోగ్యం, వాణిజ్య భవనాలు, నగర ప్రాంతాలు, వ్యూహాలు, భావనలు అనే అయిదు అంశాలపై చర్చలు జరిగాయి. వాతావరణ మార్పులను తట్టుకోగల నగర ప్రాంతాల అభివృద్ధి, భవనాల్లో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించడం, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం, సుస్థిర రవాణా వ్యవస్థలు, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువడే నిర్మాణ సామగ్రి వినియోగం వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి అయ్యర్, డాక్టర్ అమితవ సర్కార్, డాక్టర్ జన్మజయ్ గుప్తా, డాక్టర్ ఆదినారాయణ, డాక్టర్ ప్రశాంత్ వర్ధన్, డాక్టర్ ఫైజ్, డాక్టర్ అనురాగ్, డాక్టర్ రాజీవ్ తదితరులు తమ పరిశోధన ప్రాజెక్టుల ఫలితాలను వివరించారు. విద్యార్థుల ు సైతం ఈ సదస్సుకు అనుబ ంధంగా తమ విద్యా నంబంధిత ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎస్‌పీఏ విజయవాడ డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎన్. వెంకట కృష్ణ కుమార్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని, సదస్సుకు హాజరైన అతిథులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో 1,000 మంది జిల్లా N S S వాలంటీర్ల సేవలు

నిర్భయవార్త ప్రతినిధి : విజయవాడ:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు--2026 నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహిస్తున్న ఎన్నికల విధుల్లో భాగంగా వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు చెందిన 1,000 మంది జాతీయ సేవా పథకం (చీూా) వాలంటీర్లను ఓటర్లకు సహాయ సహకారాలు అందించేందుకు నియమిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మరియు జిల్లా టూరిజం డ కల్చర్ ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్ తెలిపారు.విజయవాడ నగరపాలక సంస్థతో పాటు సంబంధిత మున్సిపాలిటీల పరిధిలోని మొత్తం 1,952 పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో వాలంటీర్లు సేవలందించనున్నారు. అవసరాన్ని బట్టి పోలింగ్ కేంద్రాల వద్ద ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది వాలంటీర్లను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ ఎన్నికల సందర్భంగా ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లులకు అవసరమైన సహాయాన్ని అందించడం, తాగునీటి సదుపాయంలో సహకరించడం, క్యూలైన్ల నిర్వహణలో తోడ్పడటం, పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సాధారణ సూచనలు అందించడం వంటి సేవలను వాలంటీర్లు నిర్వహించనున్నారు. ఓటు వేయడానికి వచ్చే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.విజయవాడలోని వివిధ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు చెందిన చీూా వాలంటీర్లు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ఓటర్లు, పోలింగ్ సిబ్బంది, పోలీసు అధికారులు చీూా వాలంటీర్ల సేవలను నమర్థవంతంగా వినియోగించుకోవాలని, వాలంటీర్లకు అవసరమైన కనీస సదుపాయాలు, తాగునీరు, విశ్రాంతి, భద్రత వంటి ఏర్పాట్లను సంబంధిత అధికారులు కల్పించాలని జిల్లా చీూా వాలంటీర్ల నోడల్ ఆఫీసర్ డాక్టర్ కొల్లేటి రమేష్ కోరారు.ప్రజాస్వామ్య పండుగలో యువత భాగస్వామ్యం -- సేవాభావంతో ఓటర్లకు అండగా చీూా వాలంటీర్లు.





అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలపై నిషేధం

అక్టోబర్ 30 సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మద్యం దుకాణాలు మూసివేత

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ

నిర్భయవార్త ప్రతినిధి :విజయవాడ: అక్టోబర్ 30, 2026.:ఎన్.టి.ఆర్. జిల్లాలో అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు జరిగే మున్సిపల్ ప్రాంతాలతో పాటు వాటి పరిధిలోని 5 కిలోమీటర్ల మేర మద్యం విక్రయాలపై నిషేధం విధించినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు.ఎన్నికల పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకొని 2026 అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మద్యం విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, నవంబర్ 2వ తేదీన రీపోలింగ్ నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడితే, ఆ రోజున కూడా మద్యం విక్రయాలపై నిషేధం కొనసాగుతుందని తెలిపారు. నవంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నిషేధం లిక్కర్ షాపులు, బార్లు, మిలిటరీ క్యాంటీన్లు, ఒఇ-1 లైసెన్సులు, కల్లు దుకాణాలు (ఒజూ, ఒఖీ), డిస్టిలరీలు, బ్రూవరీలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనలను సంబంధిత మద్యం దుకాణాలు, బార్లు మరియు ఇతర సంస్థల యజమానులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ సూచించారు.




ఆదర్శ కుటుంబం కష్టాలకు అంతే లేదు



మేకింగ్ దశలో ఉండగా.. వేరే సినిమాలతో పోలికల వల్ల స్క్రిప్ట మారుస్తున్నారని, రీషూట్లు జరుగుతున్నాయని వార్తలు వచ్చాయి. విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో సినిమా కోసం ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు అభిమానులు. దశాబ్దం కిందటే రావాల్సిన సినిమా కాస్తా.. రకరకాల కారణాల వల్ల ఆలస్యం అయి గత ఏడాది పట్టాలెక్కింది. దీంతో వీళ్లిద్దరి ఫ్యాన్స్ ఎగ్జైట్మెంట్ మామూలుగా లేదు. కానీ ఇలాంటి క్రేజీ కాంబినేషన్లో తెరకెక్కిన చిత్రానికి ఏదో ఒక అడ్డంకి వస్తూనే ఉంది. 3 మేకింగ్ దశలో ఉండగా.. వేరే సినిమాలతో పోలికల వల్ల స్క్రిప్ట మారుస్తున్నారని, రీషూట్లు జరుగుతున్నాయని వార్తలు వచ్చాయి. ఈ రూమర్లను నిజం చేస్తూ షూటింగ్ అనుకున్న దాని కంటే బాగా ఆలస్యం అయింది. తర్వాతేమో ఒకసారి రిలీజ్ డేట్ ఇచ్చాక రెండుసార్లు మార్చాల్సి వచ్చింది. మరోవైపు ఈ సినిమా ప్రోమోలు, పాటల విషయంలో ప్రేక్షకుల నుంచి బాగా విమర్శలు వచ్చాయి. రిలీజ్ ముంగిట సినిమాకు ఆశించిన హైప్ కనిపించలేదు. ఇవన్నీ చాలవన్నట్లు రిలీజ్ ముంగిట అనుకోని అవాంతరాలు తప్పట్లేదు. 'ఆదర్శ కుటుంబం' ఇంకొక్క రోజులో రిలీజ్ కాబోతుండగా.. ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పరిస్థితులు దయనీయంగా మారాయి. అర్నాబ్ తుపాను కారణంగా పలు ప్రాంతాలు అల్లకల్లోలం అయ్యాయి. పంటలతో పాటు ఆస్తి నష్టం వాటిల్లి జనాలు తీవ్ర శోకంలో మునిగిపోయి ఉన్నారు. రెగ్యులర్‌గా సినిమాలు చూసే వాళ్లలో చాలామంది ఇప్పుడు థియేటర్‌కు వచ్చే మూడ్‌లో లేరు. ఇంకోవైపు ఈ సినిమాకు ఏపీలో టికెట్ల ధరలు పెంచడం కూడా ప్రతికూలంగా మారే సంకేతాలు కనిపిస్తున్నాయి. అటు ఏపీలో, ఇటు తెలంగాణలో రెండు చోట్లా 'ఆదర్శ కుటుంబం'కు అడ్వాన్స్ బుకింగ్స్ కూడా చాలా డల్లుగా ఉన్నాయి. మామూలుగా అయితే వెంకీ, త్రివిక్రమ్ కాంబినేషన్ సినిమా అంటే జనాలు ఎగబడి టికెట్లు కొనాలి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఐతే ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లా కనిపిస్తున్న నేపథ్యంలో టాక్ బాగుంటే.. ఆటోమేటిగ్గా ఆడియన్స్ థియేటర్లకు వస్తారని టీం ఆశిస్తోంది. కాబట్టి 'ఆదర్శ కుటుంబం'కు పాజిటివ్ టాక్ రావడం చాలా ముఖ్యం.


దేవరకొండ.. ఇది గమనిస్తున్నాడా?



విజయ్ ఈ విషయాన్ని గమనిస్తున్నాడో లేదో కానీ, కెరీర్ పరంగా ఆలోచించాల్సిన అంశమే. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో వచ్చిన 'కింగ్‌డమ్'లో విజయ్ డిఫరెంట్ రోల్ లో కనిపించాడు. ఒకప్పుడు విజయ్ దేవరకొండ సినిమా అంటే యూత్‌లో ప్రత్యేకమైన క్రేజ్ ఉండేది. ప్రేమకథ అయినా, కామెడీ అయినా తనదైన స్టైల్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేవాడు. కానీ ఈ మధ్య విజయ్ ఎంచుకుంటున్న సినిమాలు చూస్తే మాత్రం ఒకే తరహా మాస్ పాత్రలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రతి సినిమాలో కొత్త లుక్, కొత్త దర్శకుడు ఉంటున్నారు. కానీ తెరపైకి వచ్చేసరికి కత్తులు, రక్తపాతం కామన్ అయిపోతున్నాయి. విజయ్ ఈ విషయాన్ని గమనిస్తున్నాడో లేదో కానీ, కెరీర్ పరంగా ఆలోచించాల్సిన అంశమే. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో వచ్చిన 'కింగ్‌డమ్'లో విజయ్ డిఫరెంట్ రోల్ లో కనిపించాడు. అన్నదమ్ముల అనుబంధం ప్రధానంగా సాగే కథలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయి. కొన్ని చోట్ల హింస కూడా ఎక్కువగానే కనిపించింది. సినిమా మేకింగ్‌కు ప్రశంసలు వచ్చినా ఎమోషన్స్ ఆశించిన స్థాయిలో కనెక్ట్ కాలేదనే విమర్శలు వచ్చాయి. దీంతో విజయ్ కష్టానికి తగ్గ ఫలితం దక్కలేదు. రీసెంట్ గా వచ్చిన 'రణబాలి'లోనూ దాదాపు ఇదే పరిస్థితి. బ్రిటిష్ పాలన నేపథ్యంలో సాగిన కథ కోసం విజయ్ పూర్తిగా మారిపోయాడు. రాయలసీమ యాస, బాడీ లాంగ్వేజ్ కోసం కష్టపడ్డాడు. అయితే సినిమాలో నరుకుడు మరింత ఎక్కువైంది. ముఖ్యంగా రెండో భాగంలో హింసాత్మక సన్నివేశాలు ఎక్కువయ్యాయనే అభిప్రాయాలు వచ్చాయి. అప్పటికే చాలా వరకు ఎడిట్ లో లేపేసారు. కథలో మంచి ఎమోషన్ ఉన్నా రక్తపాతం ఎక్కువ కావడంతో సినిమా మిక్స్‌డ్ టాక్ అందుకుంది. ఇప్పుడు 'రౌడీ జనార్ధన' పరిస్థితి చూస్తే మరోసారి అదే అనిపిస్తోంది. రవికిరణ్ కోలా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా గ్లింప్స్ గతంలోనే విడుదలైంది. అందులో విజయ్ ఒంటినిండా రక్తంతో, కత్తి పట్టుకుని ప్రత్యర్థులను నరుకుతూ కనిపించాడు. ఎనభై దశకం నాటి రౌడీయిజం నేపథ్యంలో కథ సాగనుంది. పూర్తి సినిమా ఎలా ఉంటుందనేది పక్కనపెడితే, ప్రమోషనల్ వీడియోలో మాత్రం మరోసారి హింసకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. నిజానికి విజయ్‌కు మాస్ పాత్రలతో పాటు లవ్ స్టోరీలు కూడా బాగా కలిసొచ్చాయి. 'పెళ్లిచూపులు', 'గీత గోవిందం' లాంటి సినిమాల్లో అతడి కామెడీ టైమింగ్, యూత్‌ఫుల్ పెర్ఫార్మెన్స్ ఆకట్టుకున్నాయి. 'టాక్సీవాలా'తో మరో తరహా వినోదాన్ని అందించాడు. అలాంటి విజయ్ వరుసగా భారీ యాక్షన్ సినిమాలకే పరిమితమవడం కొంత ఆశ్చర్యంగా ఉంది. మధ్యలో ఖుషి, ఫ్యామిలీ స్టార్ లాంటివి చేశాడు కానీ అవేమి అంతగా క్లిక్ కాలేదు. మంచి ప్రేమకథ లేదా కామెడీతో కూడిన డిఫరెంట్ కాన్సెప్ట్ చేస్తే ప్రేక్షకులకు కూడా కొత్తగా ఉంటుంది. మరోవైపు విజయ్ తర్వాతి లైనప్‌లో 'హాయ్ నాన్న' దర్శకుడు శౌర్యువ్ సినిమా కూడా ఉంది. నాని లాంటి హీరోతో ఎమోషనల్ కథను తెరకెక్కించిన దర్శకుడు ఈసారి భారీ స్కేల్ ఎంచుకున్నారు. ఇప్పటికే విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లోనూ ఆయుధాలు, ఆగ్రహంతో కూడిన వాతావరణం కనిపించింది.

ఎక్స్‌పోజింగ్ కాదు..పెద్ది సినిమాలో పెద్ద సమస్య ఇదే...!

పెద్దిలో హీరో మొదట హీరోయిన్‌ను బలవంతంగా ముద్దు పెట్టుకోవడం, ఆ తర్వాత అదే నాకు తెలిసిన ప్రేమ అని సమర్థించుకోవడం. పెద్ది సినిమా గురించి సోషల్ మీడియాలో ప్రస్తుతం ఎంతమంది చర్చించుకుంటున్నారు.



కొంతమంది ఈ సినిమాని సపోర్ట్ చేస్తూ ఉండగా.. మరి కొంతమంది జాన్వీ కపూర్ పై నెగిటివ్ కామెంట్స్ లో చేస్తున్నారు. ఇంకొంతమంది మాత్రం జాన్వి కపూర్ ని సపోర్ట్ చేస్తూ మాట్లాడుతున్నారు. ఏదేమైనా ఇక్కడ అందరూ అర్థం చేసుకోవాల్సిన విషయం ఒకటి ఉంది. చాలా సినిమాలో హీరోయిన్ ఎక్స్పోజింగ్ చేస్తారు. కానీ పెద్ది సినిమాకి మాత్రమే ఈ సమస్యలు ఎందుకు వచ్చాయి అంటే.. ఈ సినిమాలో సమస్య అసలు ఎక్స్పోజింగ్ కాదు. మరి ఈ చిత్రంలో అసలు వచ్చిన సమస్యలతో ఒకసారి చూద్దాం.... ఉప్పెన సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు బుచ్చిబాబు సాన, హీరోయిన్‌గా జాన్వీ కపూర్.. ఇలాంటి కాంబినేషన్‌లో సినిమా వస్తుందంటే ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా ఉంటాయి. ముఖ్యంగా హీరోయిన్ పాత్రకు కూడా మంచి ప్రాధాన్యత ఉంటుందని అందరూ భావిస్తారు. హీరోయిన్‌కు ఎక్కువ స్క్రీన్ టైమ్ లేకపోయినా పర్లేదు. కానీ ఆమె పాత్రను ఎలా చూపిస్తున్నారు అనేదే ముఖ్యం. పెద్ది సినిమా విషయంలో సమస్య కేవలం గ్లామర్ లేదా అందాల ప్రదర్శన మాత్రమే కాదు. కథలో హీరోయిన్ పాత్రను తీర్చిదిద్దిన విధానంలో లోపాలు కనిపించడం. ముఖ్యంగా అమ్మాయి ఇష్టం లేకపోయినా హీరో బలవంతంగా ముద్దు పెట్టుకోవడం, దానిని ప్రేమగా చూపించడం ఎంతవరకు కరెక్ట్? ఒక అమ్మాయి అంగీకారం లేకుండా చేసే పనిని ప్రేమగా ఎలా చూపిస్తారు? ఇలాంటి విషయాల గురించి దర్శకుడు చాలా జాగ్రత్త చూసుకొని ఉండాలి. అయితే ఇక్కడ మరో ప్రశ్న కూడా సోషల్ మీడియాలో వినిపిస్తోంది. జాన్వీ కపూర్ గతంలో దేవర సినిమాలో నటించింది. అందులో ఆమె పాత్రను ఎలా చూపించారు? అలాగే ది ప్యారడైజ్ సినిమాలో కయాదు లోహర్ పాత్రను ఎలా ప్రెజెంట్ చేస్తున్నారు? బాలీవుడ్ సినిమాల్లో కూడా హీరోయిన్లను గ్లామర్ కోసమే ఉపయోగించే సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మరి వాటి గురించి ఎందుకు ఇంత పెద్ద చర్చ జరగడం లేదు? ఇలాంటి ప్రశ్నకు వినిపిస్తూనే ఉన్నాయి. దీనికి సమాధానం కూడా ఒకటే.. పెట్టి సినిమా మెయిన్ గా టార్గెట్ అవ్వడానికి కారణం బుచ్చిబాబు రాసుకున్న హీరోయిన్ పాత్ర అలానే దాని చుట్టూ తిరిగే కథ. పెద్దిలో హీరో మొదట హీరోయిన్‌ను బలవంతంగా ముద్దు పెట్టుకోవడం, ఆ తర్వాత అదే నాకు తెలిసిన ప్రేమ అని సమర్థించుకోవడం. అక్కడ తప్పు హీరో పాత్ర చిత్రణలో, కథను రాసిన విధానంలో ఉంది. స్టాకింగ్, బలవంతపు ముద్దులు, మహిళలపై వేధింపులను ప్రేమగా చూపించడం తప్పే. అలాంటి సన్నివేశాలు ఉన్న ప్రతి సినిమాను ప్రశ్నించాలి. తెలుగు, తమిళ, హిందీ అనే తేడా ఉండకూడదు. పెద్ది సినిమాలో తప్పులు ఉంటే తప్పకుండా ప్రశ్నించాలి. అలానే మహిళలను సినిమాల్లో చూపించే విధానంపై అన్ని పరిశ్రమల్లో ఒకే విధమైన ప్రశ్నలు రావాలి. ఒక సినిమాను మాత్రమే టార్గెట్ చేయడం వల్ల అసలు సమస్యకు పరిష్కారం దొరకదు.

కమల్‌కు రెండు తరాల బలం!

ఒకవైపు దశాబ్దాలుగా బాక్సాఫీస్‌ను ఏలుతున్న హీరో, మరోవైపు ఈ తరంలో వేగంగా ఎదిగిన స్టార్. ఇద్దరినీ ఒకే బ్యానర్‌లోకి తీసుకురావడం వెనుక మంచి ప్లానింగ్ కనిపిస్తోంది. సినిమాల్లో యాభై ఏళ్లకు పైగా అనుభవం ఉన్న కమల్ హాసన్ ఇప్పుడు నిర్మాతగా తీసుకుంటున్న నిర్ణయాలు కూడా ఆసక్తికరంగా ఉన్నాయి. తన సినిమాలు చేసుకుంటూనే ఇతర హీరోలతో భారీ ప్రాజెక్టులు సెట్ చేస్తున్నారు. నటుడిగా సొంత ఇమేజ్‌ను పక్కనపెట్టి కథకు తగ్గ హీరోలను ఎంచుకుంటున్నారు. అది కూడా ఒకే తరహా స్టార్లతో కాదు. ఒకవైపు దశాబ్దాలుగా బాక్సాఫీస్‌ను ఏలుతున్న హీరో, మరోవైపు ఈ తరంలో వేగంగా ఎదిగిన స్టార్. ఇద్దరినీ ఒకే బ్యానర్‌లోకి తీసుకురావడం వెనుక మంచి ప్లానింగ్ కనిపిస్తోంది. ఎక్స్పోజింగ్ కాదు..పెద్ది సినిమాలో పెద్ద సమస్య ఇదే...! రజనీకాంత్‌తో కమల్ నిర్మిస్తున్న 'ధర్మన్' ఇప్పటికే షూటింగ్‌లో ఉంది. 'డ్రాగన్'తో మంచి హిట్ అందుకున్న అశ్వత్ మారిముత్తు దీనికి దర్శకుడు. అశ్వత్ రజనీతో పనిచేయడం ఇదే తొలిసారి. ఒకప్పుడు తమిళనాట పోటాపోటీగా సినిమాలు చేసిన ఇద్దరు పెద్ద స్టార్లు ఇప్పుడు నిర్మాత, హీరోగా కలిశారు. రజనీకి ఉన్న భారీ మార్కెట్ ఈ ప్రాజెక్టుకు ప్రధాన బలం. పైగా ఆయనను కొత్త తరానికి నచ్చే స్టైల్‌లో చూపిస్తున్నట్లు దర్శకుడు ముందే చెప్పారు. ఇక శివకార్తికేయన్ విషయంలో కమల్ ప్లానింగ్ మరోలా ఉంది. ఇదివరకే కమల్ సంస్థ నిర్మించిన 'అమరన్' పెద్ద విజయాన్ని అందుకుంది. అంతకుముందు ఫ్యామిలీ, కామెడీ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న శివకార్తికేయన్ ఆ చిత్రంలో ఆర్మీ ఆఫీసర్‌గా ఆకట్టుకున్నారు. ఆ తర్వాత ఆయనతో మళ్లీ 'సేయోన్' నిర్మిస్తున్నారు. ఒక్క విజయంతో ఆ కాంబినేషన్‌ను వదిలేయకుండా మరో కథతో ముందుకు వెళ్లడం విశేషం. ఈసారి మాత్రం 'అమరన్'కు భిన్నంగా గ్రామీణ కథను ఎంచుకున్నారు. అయితే రజనీ, శివకార్తికేయన్ సినిమాల నుంచి ప్రేక్షకులు ఆశించేది ఒకేలా ఉండదు. రజనీకి మొదటి రోజు భారీ ఓపెనింగ్స్ తీసుకొచ్చే అభిమానుల బలం ఉంది. శివకార్తికేయన్‌కు కుటుంబ ప్రేక్షకులు, యూత్‌లో మంచి ఆదరణ ఉంది. 'ధర్మన్'ను స్టైలిష్ యాక్షన్ సినిమాగా తెరకెక్కిస్తుంటే, 'సేయోన్' గ్రామీణ నేపథ్యంలో సాగనుంది. నిర్మాతగా రెండు రకాల సినిమాలను ఒకేసారి చేయడం కమల్ సంస్థకు కలిసొచ్చే అంశం. ఇక్కడ ఇంకో విశేషం దర్శకుల సెలక్షన్. రజనీ సినిమాకు 'డ్రాగన్'



తీసిన అశ్వత్‌ను పెట్టారు. శివకార్తికేయన్ సినిమాకు 'తాయ్ కిళవి' దర్శకుడు శివకుమార్ మురుగేశన్‌ను తీసుకున్నారు. ఇద్దరూ కొత్త తరానికి చెందిన దర్శకులే. ఒకవైపు అనుభవమున్న స్టార్లను నమ్ముకుంటూనే, మరోవైపు కొత్త దర్శకులకు పెద్ద అవకాశాలు ఇవ్వడం కమల్ నిర్మాణ సంస్థలో కనిపిస్తున్న అతిపెద్ద మార్పు. 'అమరన్'తో పనిచేసిన పద్ధతినే ఇప్పుడు మరింత విస్తరిస్తున్నారు. ఆ సినిమా దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామికి కూడా అది రెండో చిత్రమే. 'ధర్మన్' మూడో షూటింగ్ షెడ్యూల్ కూడా అక్టోబర్ ఆరంభంలో పూర్తయింది. ఇందులో సిమ్రాన్, రాశీ ఖన్నా నటిస్తుండగా అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. మరోవైపు 'సేయోన్'లో భాగ్యశ్రీ బోర్సే, రాజ్ బి శెట్టి, సీమాన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దీనికి సంతోష్ నారాయణన్ సంగీత దర్శకుడు. రెండు సినిమాలకు వేర్వేరు టీమ్‌లు, వేర్వేరు కథలు సిద్ధమయ్యాయి. 'సేయోన్' షూటింగ్ మేలోనే మొదలైంది. ఇక వీటి విడుదల తేదీలపై అధికారిక అప్‌డేట్స్ రావాల్సి ఉంది.

ఈ ఓటిటిలో స్ట్రీమింగ్ కి వచ్చేసిన సందీప్ కిషన్ 'సిగ్మా'..!



యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ హీరోగా జాతి రత్నాలు బ్యూటీ ఫరియా అబ్దుల్లా హీరోయిన్ గా తమిళనాడు సీఎం దళపతి విజయ్ తనయుడు జేసన్ సంజయ్ తన దర్శకత్వంలో చేసిన మొదటి సినిమానే 'సిగ్మా'. మెగాస్టార్ చిరంజీవి లాంటి దిగ్గజం వచ్చి చిత్ర యూనిట్ కి తన బెస్ట్ విషెస్ అందించారు. అయితే ఈ సినిమా థియేటర్స్ లో ఊహించని విధంగా వైఫల్యం చెందింది. మరి ఫైనల్ గా ఈ సినిమా ఓటిటిలో ఆడియెన్స్ ని అలరించడానికి వచ్చేసింది. ఈ చిత్రాన్ని పాపులర్ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోగా అందులో ఈ సినిమా నేటి నుంచి అందుబాటులోకి వచ్చేసింది. ఒరిజినల్ తమిళ్ తో పాటుగా డబ్బింగ్ తెలుగు సహా ఇతర పాన్ ఇండియా భాషల్లో ఈ సినిమా అందుబాటులోకి వచ్చేసింది. సో ఒకవేళ ఈ సినిమాని చూడాలి అనుకునేవారు ఇప్పుడు చూడొచ్చు. ఈ సినిమాకి థమన్ సంగీతం అందించాడు. అలాగే లైకా ప్రొడక్షన్స్ నిర్మాణం వహించారు

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197